ఉదంకోపాఖ్యానం

(సరళ వ్యాఖ్యాన సహితం)

వ్యాఖ్యాత

డా॥ దివాకర్ల వేంకటావధాని

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

2018

UDANKOPAKHYANAM
with Commentary

Commentary by
Dr. Divakarla Venkatavadhani

T.T.D. Religious Publications Series No. 1290
© All Rights Reserved

First Print : 2018

Copies : 2000

Published by :
Sri Anil Kumar Singhal, I.A.S.
Executive Officer
Tirumala Tirupati Devasthanams
Tirupati

D.T.P.
Publications Division
T.T.D., Tirupati.

Printed at
Tirumala Tirupati Devasthanams Press
Tirupati - 517 507

ముందుమాట

భారతీయ సనాతన సంస్కృతీ, సంప్రదాయాలకు వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు మూలాధారాలుగా ఖ్యాతిగాంచాయి. వేదాలలోని సారాన్ని రంగరించి భగవాన్ వేదవ్యాసుల వారు మహాభారత ఇతిహాసాన్ని పంచమవేదంగా తీర్చిదిద్దారు. మహాభారతం మన జాతీయ కావ్యం. చతుర్విధ పురుషార్థాల సాధనకు కావలసిన విజ్ఞానమంతా ఇందులో చక్కగా వేదవ్యాసుల వారు ఇమిడ్చారు. మహాభారతం పంచమవేదంగానే కాక భారతీయ విజ్ఞాన శాస్త్ర సర్వస్వంగా ప్రశస్తికెక్కింది.

వేదవ్యాసుల వారు భారత కథను జయేతిహాసంగా తీర్చిదిద్ది తన శిష్యులద్వారా వివిధ లోకాలలో వ్యాపింపజేశారు. వైశంపాయనుడు జనమేజయ మహారాజుకు ఈ కథను వినిపించాడు. అలా వినిపించగా పెంపొందిన కథను భారతం అన్నారు. ఆ తరువాత రోమహర్షణుని కుమారుడైన ఉగ్రశ్రవసుడు నైమిశారణ్యంలో సత్రయాగం చేస్తున్న శౌనకాది మహామునులకు వివరించాడు. మునులడిగిన ప్రశ్నలకు ఉగ్రశ్రవసుడు చెప్పిన కథార్థాలతో కలిపి భారతం **"మహాభారతం"** అయ్యింది.

"యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్ క్వచిత్"

ఇందులోఉన్నది ఎక్కడైనా ఉంటుంది. ఇందులో లేనిది ఎక్కడా ఉండదు – అని సూత పౌరాణికులు శౌనకాది మహామునులకు మహాభారత ప్రాశస్త్యాన్ని వివరించాడు.

పంచమవేదంగా, భారతీయ విజ్ఞాన శాస్త్రంగా ఖ్యాతిగొన్న సంస్కృత వ్యాసభారతాన్ని ఆదికవి నన్నయ, కవిబ్రహ్మ తిక్కన, ప్రబంధ పరమేశ్వరుడు ఎఱ్ఱన ఆంధ్రీకరించారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు ధర్మప్రచారంలో భాగంగా కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతానికి తెలుగులో సుప్రసిద్ధ పండితులచే చక్కటి వ్యాఖ్యానాన్ని వ్రాయించి 15 సంపుటాలుగా ముద్రించి తెలుగు ప్రజలకు అందించింది. తి.తి.దే. ముద్రించిన కవిత్రయ విరచిత శ్రీమహాభారతం విశేష ప్రజాదరణను పొంది ఇప్పటికే దాదాపు 25,000లకు పైగా ప్రతులు అమ్ముడుపోయాయి.

ఇదివరకు తి.తి.దే. ముద్రించిన కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతంలోని ప్రశస్తమైన నలోపాఖ్యానం, సావిత్రి ఉపాఖ్యానం వంటి ఉపాఖ్యానాలను, సుప్రసిద్ధ ఘట్టాలను, కథలను వ్యాఖ్యానంతోపాటు ప్రత్యేకించి చిన్న చిన్న పుస్తకాలుగా ముద్రిస్తే నేటి తరం సమాజానికి చాలా ఉపయోగకారి అవుతుందని తి.తి.దేవస్థానములు సంకల్పించింది. ఆ సంకల్పానికి ప్రతిరూపమే ఈ భారతోపాఖ్యానాలు గ్రంథమాల. ఈ గ్రంథమాలలో భాగంగా ఉదంకోపాఖ్యానం, గరుడోపాఖ్యానం, యయాతి చరిత్ర, దుష్యంతోపాఖ్యానం, శిశుపాలుని కథ, నలోపాఖ్యానం, ధర్మవ్యాధోపాఖ్యానం, రామోపాఖ్యానం, సావిత్ర్యుపాఖ్యానం, కీచకుని కథ, శ్రీకృష్ణరాయబారం, అంబోపాఖ్యానం, హంసకాకీయోపాఖ్యానం, నాడీజంఘుని కథ, బ్రాహ్మణగీతలు అనే 15 శీర్షికలను ఎంపిక చేసి తెలుగు రాష్ట్రాలలో సుప్రసిద్ధులైన పండితులచే చక్కటి పీఠికలను వ్రాయించి, ముద్రించి ప్రజలకు అందుబాటులోనికి తీసుకువస్తున్నది. ఇందులో భాగమే ప్రస్తుతం మీకందిస్తున్న **ఉదంకోపాఖ్యానం.**

భక్తమహాశయులు, సాహితీ ప్రియులు ఈ గ్రంథమును ఆదరిస్తారని మనసార కోరుకుంటూ...

సదా శ్రీవారిసేవలో...

కార్యనిర్వహణాధికారి
తి.తి.దేవస్థానములు, తిరుపతి

పీఠిక

ఉపోద్ఘాతము:

'కార్పొరేట్' విద్య వ్రేళ్లూని నిలద్రొక్కుకుంటున్న పరిస్థితుల్లో గురుశిష్య పవిత్రబంధం బెడిసికొడుతున్నది. గురువులను శిష్యులు చిత్తశుద్ధితో అంకితభావంతో సేవించటం అనే వ్యవస్థ పూర్తిగా తెరమరుగవుతూ ఉంది.

పనిచేస్తున్నందుకు తనకు ఎంత ధనం వస్తుంది? విశ్రాంతి, సుఖం, ఏమేర లభిస్తాయి? అనే దృష్టితో గురువులు ఉంటున్నారు. చదువు 'కొంటున్న'ందుకు దానికైన ఖర్చుకు ఎన్నిరెట్లు సంపాదనగల ఉద్యోగం లభిస్తుంది? తనకు ఎన్ని మార్కులు లేదా ఎంత గ్రేడు రావాలి? వాటి సాధనకై ఏయే అధమపద్ధతులు పాటించాలి? అనే ఆలోచనలలో శిష్యులు ఉంటున్నారు. సత్సంప్రదాయం, నైతిక శిక్షణ, లోతైన అధ్యయనం ఆటకెక్కుతున్నది. ఎక్కడో ఒకచోట ఈ గుణాలుంటే అవి అపహాస్యానికి గురవుతూ ఉన్నాయి.

పురాణాల్లో అత్యున్నతమైన విలువల్ని ప్రబోధించే సన్నివేశాలు కథలు అనేకంగా ఉన్నాయి. వాటిని కవితాత్మకంగా పరమ రమణీయంగా చెప్పిన కవులూ ఉన్నారు. అట్టి ఆఖ్యానాలను విద్యార్థులకు చక్కగా బోధించి, వారిచే అనుశీలన చేయిస్తే, శిష్యుల దృక్పథంలో నడవడిలో కొంతైనా మార్పు వచ్చే అవకాశం ఉంది.

అంతో ఇంతో భాషాజ్ఞానం ఉండి, కవితపై ఆసక్తి కలిగి, గురు శిష్యుల ఔన్నత్యాన్ని తెలిసికోవాలని ఆకాంక్షించేవారికి, ఆంధ్రమహాభారతం ఆదిపర్వంలోని ఉదంకోపాఖ్యానం లెస్సగా ఉపయోగపడుతుంది.

ఈ ఉపాఖ్యానాన్ని రచించినది నన్నయ. ఆయన తనకు పూర్వం అస్పష్టంగా ఉన్న భాషను సంస్కరించినాడు. సంస్కృతభాషా పదజాలాన్ని

తెలుగుతో విరివిగా కలిపి ఈ భాషకు అదనపు సౌందర్యాన్ని కలిగించినాడు. శబ్ద(వాగను) శాసనుడుగా పండితులచే స్తుతింపబడినాడు. ఆనాడు మౌఖిక సాహిత్యం ఎంతగా ప్రచారంలో ఉన్నా, లిఖిత గ్రంథంగా తొలుత వెలువడింది నన్నయ భారతమే కావటంతో ఆయన 'ఆదికవి' గా గౌరవింపబడినాడు. తనకు అనురక్తుడు, హితుడు అయిన రాజరాజనరేంద్రుని ఆస్థానకవిగా ఉంటూ ఆయనచే పంచమవేదమైన భారత సారాన్ని జగద్ధితాకాంక్షతో వ్యాపింపజేయటానికి కారణమైనాడు.

కథాసంగ్రహం

పైలుని గురుకులంలో ఉదంకుడు శిష్యుడు. విద్యాభ్యాసం ముగించి గురుదక్షిణ ఇవ్వటానికి సిద్ధమైనాడు. గురుపత్ని అభిమతం మేరకు పౌష్యుడనే రాజు భార్యయొక్క కుండలాలు అర్థించి తేవటానికి బయలుదేరినాడు.

అడవిలో వెళ్లుతూ ఉండగా వృషభాన్ని ఎక్కి వస్తున్న ఒక దివ్యపురుషుడు కనిపించినాడు. అతడు గోమయాన్ని భక్షింపుమని ఉదంకుని ఆదేశించినాడు. ఆ మేరకే ఎద్దుపేడను తిని అతని అనుగ్రహానికి పాత్రుడైనాడు. మహావేగంతో పౌష్యుని దగ్గరకు వెళ్లి రాజును దీవించినాడు. అతనిచే అతిథి సత్కారాలు పొంది, తన రాకకు కారణము తెలిపినాడు. రాజు 'నా మాటగా చెప్పి రాణిగారిని అడుగుము' అన్నాడు. ఉదంకుడు అంతఃపురం వెళ్లగా ఆమె కనిపించలేదు. వెనుదిరిగి వచ్చి విషయం రాజుకు చెప్పినాడు. అతడు 'అపవిత్రులకు నా భార్య కనబడదు' అన్నాడు.

ఇంతకుమునుపు తాను గోమయం తిన్న అశుచికార్యం గుర్తుకు తెచ్చుకొన్నాడు. పవిత్రుడగుటకై పాదప్రక్షాళన చేసి ఆచమించినాడు. రాణిని దర్శించి కుండలాలు అభ్యర్థించినాడు. ఆమె ఉదంకునకు నమస్కరించి, సంతోషంగా వాటిని ఇచ్చి 'చాలా దినాలుగా తక్షకుడు వీటికై కాచుకొన్నాడు. జాగ్రత్తగా వెళ్లుము' అనింది.

ఇంతలో 'అన్నం తినిపొమ్ము' అని పౌష్యుడు ఉదంకుని కోరినాడు. వడ్డించిన అన్నంలో వెంట్రుకలు చూచి కోపించినాడు 'పరీక్షించకుండ అన్నం పెట్టినావు గ్రుడ్డివాడవు కమ్ము' అని శపించినాడు. 'ఇంత చిన్న తప్పునకే శాపమిచ్చినావు కావున నీవు కూడా సంతానహీనుడవు కమ్ము' అని రాజు ఉదంకునకు ప్రతిశాపమిచ్చాడు. 'వెన్నవంటి మనస్సుగల విప్రుడు మాత్రమే శాపము మరలించుటకు అర్హుడు. కఠిన హృదయుడైన రాజుకాదు' అని పౌష్యుడు వేడుకొన్నాడు. ఉదంకుడు కరుణించి 'తొందరలో నీకు శాపం తొలగుతుంది' అని అభయమిచ్చి ఇంటిదారి పట్టినాడు.

దారిమధ్యలో ఉండగా సాయంకాలమైంది. సంధ్యావార్చటానికై కుండలాలను ఒడ్డునపెట్టి స్నానానికై చెరువులోనికి దిగినాడు. ఇదే అదనుగా తక్షకుడు నగ్నంగా వచ్చి చిక్కకుండ నిజరూపంతో భూవివరంలో ప్రవేశించి నాగలోకం చేరినాడు. ఉదంకుడు కూడ పాతాళం చేరి కార్యాన్ని సఫలం చేసికోవటానికై నాగపతులను స్తుతించినాడు.

ఉదంకుని ఎదుట ఒక విచిత్రం కనపడింది. అక్కడ తెలుపు నలుపు దారాలు నేస్తున్న పండ్రెండు రేకులుగల చక్రాన్ని త్రిప్పే ఆర్గురు యువకులను, ఎత్తైన గుఱ్ఱాన్ని ఎక్కివస్తున్న ఒక మహాత్ముణ్ణి చూచాడు. ఆ తేజస్సంపన్నుని ఉదంకుడు భక్తితో స్తోత్రం చేసి నాగులను తనకు వశమగునట్లు చేయుమని ప్రార్థించినాడు. అతడు అనుగ్రహించి గుఱ్ఱపుచెవిలో ఊదుమన్నాడు. ఉదంకుడు ఆమేరకు చేయగా, దానియొక్క అవయవాలనుండి భయంకరంగా అగ్నిజ్వాలలు వెలువడి అంతటా వ్యాపించినాయి. అది చూచి సర్పాలన్నీ వణికిపోయాయి. తక్షకుడు తక్షణమే కుండలాలు తెచ్చి ఉదంకునకు ఇచ్చినాడు.

వ్రతం చేస్తున్న తనకు 'నాలుగు దినాల లోపుగా కుండలాలను తెచ్చి యిమ్ము' అని గురువు భార్య కోరింది. కాగా మిగిలిన సమయం

తక్కువ, చేయవలసిన ప్రయాణం ఎక్కువ. పాతాళం నుండి సకాలంలో వెళ్లటం సాధ్యమా? అని ఆలోచనలో పడ్డాడు. ఆ దివ్యపురుషుడు ఉదంకుని భావం తెలిసికొని అతివేగంగా వెళ్లే తురంగాన్ని ఇచ్చినాడు. దానితో నిర్ణీతమైన గడువులోగా గురుసదనం చేరినాడు. గురుసతి శుచియై వాటిని స్వీకరించి తాను సంకల్పించిన ఉత్సవాన్ని ముగించింది.

గురువైన పైలుడు 'ఆలస్యానికి కారణమేమి?' అని అడిగినాడు. ఇంతదాకా జరిగిన ఉదంతమంతా ఉదంకుడు చెప్పినాడు. పాతాళంలో 'తనకు కనిపించిన దృశ్యాల ఆంతర్యం వివరించండి' అని శిష్యుడు గురువును అడిగినాడు. అతని సందేహ నివృత్తికై "తొలుత ఎద్దుపై కనబడినవాడు ఇంద్రుడని, ఆ యెద్దు ఐరావతమని, దానిపేడ అమృతమని, నల్లని తెల్లని దారాలు రేయింబవళ్లని, దానిని వడుకుతున్న స్త్రీలిద్దరు ధాత విధాతలని, పన్నెండు రేకులుగల చక్రమే సంవత్సరమని, దానిని త్రిప్పే ఆర్గురు ఋతువులకు సంకేతమని, గుఱ్ఱము అగ్నియని, దానిని ఎక్కివస్తున్న పురుషుడు వరుణుడని, ఇవన్నీ నీ విజయానికి కారణమయ్యాయి" అని చెప్పి 'మాకు ప్రియాన్ని కలిగించిన నీకు సత్ఫలితాలు కలుగుతాయి' అని దీవించినాడు.

ఉదంకుని అష్టాదశ గుణాలు:

నన్నయ కథాగమనాన్ని అనుసరించి ఉదంకుని వివిధ విశేషణాలతో వర్ణించినాడు. అవి క్రింది విధంగా ఉన్నాయి. ఇవన్నీ ఉదంకునిలో సార్థకంగా సాక్షాత్కరిస్తున్నవే. 1) బ్రహ్మతో సమానుడు 2) తపోబలంతో పాపాలను ప్రక్షాళన చేసికొన్నవాడు 3) భయమెరుగని వాడు 4) పూజ్యులైన పెద్దల్ని సేవించేవాడు 5) పెద్దలపట్ల భక్తితో మెలిగేవాడు 6) పెద్దల దయతో అష్టసిద్ధులు సాధించుకొన్నవాడు 7) గురువులకు ఇష్టమైన పనులు నెరవేర్చేవాడు 8) గురువుల కార్యాలను సఫలం చేయటానికి

ఇతరులను యాచించుటలో సైతం సంతోషం పొందేవాడు 9) పరమపవిత్రుడు 10) సూర్యునితో సమానమైన తేజస్సు కలవాడు 11) లోకులచేత స్తుతింపబడేవాడు 12) పరిమితమైన వాక్కులు కలవాడు 13) నిర్మలమైన వర్తన కలవాడు 14) సత్యయుక్తమైన స్తోత్రములచే ఎదుటివారికి ప్రీతిని కలిగించేవాడు 15) శివునితో సమానుడు 16) నిర్మల తపోమహిమాన్వితుడు 17) మునిశ్రేష్ఠుడు 18) శత్రుసంహారకుడు.

పై గుణాలన్నీ విద్యాభ్యాసం ముగిసేనాటికి శిష్యునిలో తప్పక ఉండవలెనని 'ఋషివంటి నన్నయ' అభిప్రాయం. మరి నేటి శిష్యులలో ఇవి ఎన్ని ఉన్నాయని వేయి దివిటీలు పట్టి వెదికినా ఒక్కటీ కనరాదు. ఈ విశిష్ట లక్షణాలను శిష్యులకు కలిగించుటకు గురువులలో ఇంకెన్ని గొప్పగుణాలు ఉండవలెనో మనం ఆలోచింపవలసి ఉన్నది.

కవితావిశేషాలు:

నన్నయ భారతాన్ని అనువదించాడు అనటం ఆయనకు మహా అపకారం చేసినట్లు అవుతుంది. ఆయన ఆంధ్రీకరించాడనుటయే సమంజసం. అనగా ఆంధ్రభాషా సహజత్వాన్ని తెలుగు భారతానికి అలదినాడని అర్థం. ప్రధానకథను వదలకుండ, దానికి పోషకంగా ఉన్న ఉపకథలను మాత్రం గ్రహించినాడు. కథలోని పాత్రల్ని చైతన్యవంతంగా కదుపుతూ రసపోషణ గావించినాడు. ఉదంకోపాఖ్యాన కవితా విశేషాలు క్రింది విధంగా ఉన్నాయి.

అంకారాలు:

ఉదంకుడు పంకజ సన్నిభుడు (పద్మముతో పోల్చదగినవాడు) అనుట, శంకరనిభుడు (శివునితో సమానమైనవాడు) అనుట ఉపమాలంకారములే. బ్రాహ్మణుని మనస్సు నవ్యనవనీత సమానము, పలుకు దారుణాఖండల శస్త్రతుల్యము-అనుట పద్యానికి నిండుదనాన్ని కలిగిస్తున్న ఉపమాలంకారమే.

అఘపంకక్షాళన మహాతపస్సలిలుడు (పాపమనే బురదను పోగొట్టగల తపస్సనే జలము కలవాడు) అనుట రూపకాలంకారము. “విప్రుడోపు, ఓపందతిశాంతుడయ్యు నరపాలుడు శాపము గ్రమ్మరింపగన్” అనుట కావ్యలింగాలంకారము. అగ్నిజ్వాలలను బడబాగ్నికీలలుగా ఊహించుట ఉత్ప్రేక్షాలంకారము. ‘గురుకార్య నిరతులగు సత్పురుషుల కగుటరుదె? అధికఫలంబుల్ – అనుట అర్థాంతరన్యాసాలంకారము.

పద్యనిర్మాణం:

నన్నయ్యలో కందపద్యాల సంఖ్య ఎక్కువ. అవి వైవిధ్యభరితంగా ఉంటాయి. ప్రథమ పద్యం చదరంగంలో గుఱ్ఱంవలె దూకుతూ ఉంది. బిందుపూర్వకమైన కకారప్రాస, ఒకపాదం నుండి మరొకపాదంలోనికి చొచ్చుకొనిపోయే సమాసం, దీనికి పోషకంగా ఉన్నాయి. కొన్ని మారులు భావాన్నిబట్టి పాదం విరుగుతూ పరుగుతీస్తుంది. రెండవపద్యాన్ని చూస్తే ఈ సత్యం వెల్లడి అవుతుంది. ఈ విధానాన్నే తర్వాతికాలంలో తిక్కన మహాకవి అనుసరించాడేమో అనిపిస్తుంది.

ధారణకు అనుకూలమైన శయ్యతో, తెలుగువారు ఎన్నటికీ మరచిపోలేని వృత్తాలు కూడా నన్నయ్యలో ఎక్కువే. ఇందులోని 10,14,15,16,17,21 క్రమసంఖ్యగల పద్యాలు అటువంటివి. ఇవన్నీ అక్షరరమ్యతకు, స్వతంత్ర భావనాశక్తికి తార్కాణాలుగా నిలుస్తాయి.

నన్నయ కొన్నిచోట్ల సీసపద్యాల్ని వర్ణనకే కాక కథాగమనానికీ ఉపయోగిస్తాడు. ఇట్టిది 24వ పద్యం. ఈ విధానంవల్ల చెప్పే విషయానికి మరింత ఊతం అబ్బినట్లవుతుంది. వీటిని ‘గునుగు సీసాలు’ అంటారు.

పైన సూచించిన పద్యాలన్నీ ఉక్తిసౌందర్యం గలవి. వీటిని కంఠస్థం చేస్తే భాషపై అధికారం వస్తుంది. ముక్తకంఠంగా చదివితే ఉచ్చారణదక్షత

అలవడుతుంది. వ్యాసరచనల్లో, వక్తృత్వం పోటీల్లో, సందర్భశుద్ధిని పాటించి ఉటంకిస్తే మంచి గుర్తింపు వస్తుంది. చురకత్తిలాంటి కథాగమనం, మెరుపుదాడివంటి భాషాప్రయోగాలు, తక్కువ అక్షరాలలో ఎక్కువ అర్థాన్ని నింపడం నన్నయలోని ప్రత్యేకతలుగా చెప్పుకోవచ్చు.

వస్తుధ్వని:

నన్నయలో వస్తునిర్దేశపు ఎత్తుగడ అనగా ప్రసన్నంగా కథను నడపటం కనిపిస్తుంది. ఈ విధానాన్ని ‘సారమతులైన కవులు లోతుగా పరిశీలించి అమితంగా అభినందిస్తారు’ అని ఆయనే భారతావతారికలో చెప్పుకొన్నాడు. ఆయన ఉదంకునకు వాడిన విశేషణాలన్నీ సాభిప్రాయాలై, జరుగబోయే కథను ధ్వనింపజేస్తాయి. ఉదంకుడు నాగులను స్తుతించడం, గురుదక్షిణ తేవటం, గురుకృపకు పాత్రుడు కావటం, మున్నగు పనుల్లో ఉదంకుని ధర్మవీరం ధ్వనిస్తుంది. ఉదంకుడు ‘మాకు’ అని చేసికొన్న బహువచన సంబోధన, తనను గురువును గురుకులాన్ని వ్యక్తం చేస్తుంది. ధర్మసాధన మాత్రమే ఎట్టి మానవునికైనా అమృతత్వాన్ని సిద్ధింప చేస్తుందని దివ్యపురుషుని వృత్తాంతం తెలుపుతుంది.

శబ్ద సంయోజనం:

నాగులను స్తుతించిన నాలుగుపద్యాలు విశిష్ట శబ్దసంయోజనతో నిండి, ‘మాకు ప్రసన్నుడయ్యెడున్’ అనే మకుటాన్ని ధరించి, శోభాయమానంగా దర్శనమిస్తాయి. తర్వాతి కవులు శతకపద్యాలలో ఈ విధానం పాటించినారు.

వేయిపడగలతో సర్పరాజు ఈ ప్రపంచాన్ని మోస్తున్నాడని చెప్పటం (పద్యం 14) సమాసాల కూర్పుతోను, ‘సరస్సరస్వతీసహిత, మహామహీభర, అజస్రసహస్ర, శాయికిపాయక, అంతకుడనంతడు’ వంటి యమకగమకాల వల్ల ఉత్పన్నమయ్యే నాదసౌందర్యంతోను, చెవులకు ఇంపు నింపుతూ ఉంది.

వాసుకి స్వభావాన్ని అంతస్థాలతో తెల్పటం (పద్యం 15), పాములు అగ్నివంటి విషాన్ని క్రక్కటాన్ని ఊష్మ పరుష స్థిరాక్షరాలతో వర్ణించటం (పద్యం 16), భయంకర దృశ్యవర్ణన (పద్యం 21) ఔచితీమంతంగా శార్దూలవృత్తంలో మహాప్రాణాక్షరాలతో నడపటం, వగైరాలు శబ్దాల కూర్పులో నన్నయ సాధించిన నేర్పును ప్రకటిస్తాయి. ఇట్టిచోట్ల అక్షరరమ్యత అనే కవితాగుణం దర్శనీయం.

వ్యాసభారతానికి భిన్నంగా నన్నయ చేసిన మార్పులు:

1) సంస్కృత భారతంలో ఉదంకుని గురువు వేదుడు. తెలుగు భారతంలో ఉదంకుని గురువు పైలుడు.

2) వ్యాసులవారు వేదుని శిష్యుల కథలన్నీ స్వీకరించినాడు. నన్నయ ఉదంకుని కథను మాత్రమే చెప్పినాడు.

3) సంస్కృతభారతంలో–ఉదంకుని గోమయభక్షణకు అంగీకరింపజేయుటకు దివ్యపురుషుడు అతని గురువు కూడ ఒకానొక సమయమున ఆవుపేడ తిన్నవాడే అని చెప్పినట్లు కలదు. తెలుగు భారతంలో ఈ ప్రస్తావన లేదు. దివ్యపురుషుడు చెప్పగానే మారుమాటాడకుండా ఉదంకుడు గోమయభక్షణ చేసినట్లు కలదు.

4) తక్షకుని పట్టుకోవడానికి ఉదంకుడు స్వహస్తాలతో నేలను త్రవ్వుతూ అలసిపోగా, ఇంద్రుడు అతనికి వజ్రాయుధశక్తి ప్రసాదించినట్లు వ్యాసుడు వ్రాసినాడు. ఈ విషయాన్ని చెప్పకుండ, ఉదంకుడు స్వశక్తితోనే సర్పలోకము ప్రవేశించినట్లు నన్నయ వ్రాసినాడు.

5) సంస్కృతంలో సర్పాలు వశం కావటానికి, గుఱ్ఱంయొక్క అపానస్థానంలో ఊదుమని ఉదంకునకు దివ్యపురుషుడు చెప్పినట్లు కలదు. తెలుగులో అశ్వంయొక్క చెవిలో ఊదుమని చెప్పినట్లు కలదు. ఈ విధంగా మార్చుటద్వారా అసభ్యత పరిహరింపబడింది.

6) మూలంలో నాగరాజుల స్తుతి లేదు. ఆంధ్రీకరణలో నాగరాజుల స్తుతిపద్యాలు ఉన్నాయి.

7) ఐరావతుని తనయుడు కుండలాలను అపహరించినట్లు వ్యాసుడు చెప్పగా, నన్నయ – ఐరావతుని తమ్ముడు తక్షకుడు ఆ పనిచేసినట్లు నన్నయ చెప్పినాడు.

8) సంస్కృతకవి విప్రుని పల్కులను మంగలి కత్తితో పోల్చినాడు. ఇది న్యూనోపమ అని భావించి తెలుగుకవి విప్రునివాక్కులు వజ్రాయుధంతో సమానం అన్నాడు.

ఇలా ఇంకా కొన్ని మూలంలో గల వాటిని నన్నయ అసలు స్పృశించనే లేదు. కాన వాటిని ప్రస్తావించటం అనవసరం. పై మార్పులలోని ఔచిత్యాన్ని సాహితీ మర్మజ్ఞులు ఊహించగలరు.

కం॥ అల్పాక్షర సాంగత్య మ
నల్పార్థక్షమ మనంగ నల్లిన నీదా
కల్పనలన్ సారస్వత
శిల్పులు పరిశోధనాగ్రశీర్షులు కారే!

అంటూ అక్షరశిల్పి నన్నయకు అంజలి ఘటిస్తూ ముగిస్తున్నాను.

అవధానాచార్య, కళారత్న
– డా॥ ఆశావాది ప్రకాశరావు,
పెనుకొండ,
చరవాణి: 94404 88600

ఉదంకోపాఖ్యానం

ఉదంకుండు పౌష్యమహాదేవికుండలంబులం దేఁబోవుట (సం. 1-3-86)

క. పంకజభవసన్నిభుఁ డఘ ।
పంకక్షాళన మహాతపస్సలిలుఁ డనా
తంకమతి పైలశిష్యుఁ డు ।
దంకుం డను మునివరుండు దద్దయు భక్తిన్. 1

ప్రతిపదార్థం: పంకజభవ, సన్నిభుఁడు= పద్మంలో పుట్టిన బ్రహ్మతో సమానుడు; అఘ, పంక, క్షాళన, మహత్, తపః, సలిలుఁడు= పాప మనే బురదను కడిగివేసే గొప్ప తప స్సనే నీరు కలవాడు; అనాతంక, మతి= భయం లేని మనస్సు కలవాడు; పైల, శిష్యుఁడు= పైలు డనే మునిశిష్యుడైన; ఉదంకుండు+అను= ఉదంకుడు అనే పేరు కల; ముని, వరుండు= మునిశ్రేష్ఠుడు; తద్దయున్= మిక్కిలి; భక్తిన్= భక్తితో.

తాత్పర్యం: బ్రహ్మతో సమానుడున్నూ, పాపమనే బురదను కడిగివేసే గొప్పతపస్సనే నీరు కలవాడున్నూ, భయం లేని మనస్సు కలవాడున్నూ అయిన పైలుడిశిష్యు డైన ఉదంకు డనే మునిశ్రేష్ఠుడు మిక్కిలిభక్తితో, (తరువాతిపద్యంతో అన్వయం.)

విశేషం: అలం: రూపకం, ఉదంకుడు వేదుడి శిష్యు డని సంస్కృతభారతంలో ఉన్నది. పైలుడు వ్యాసుడి ప్రధానశిష్యులలో ఒకడు. నన్నయ సంస్కృతభారతంలో మొదట గల ధౌమ్యశిష్యులవృత్తాంతాన్ని విడిచిపెట్టి ఉదంకోపాఖ్యానంతో తెలుగు భారతాన్ని ఆరంభించాడు. జనమేజయుడిని సర్పయాగానికి ప్రేరేపించినవాడు ఉదంకుడే.

క. గురుకులమునందు గురులకుఁ । బరిచర్య లొనర్చి తా నపరిమిత నిష్ఠా॥పరుఁ డై జ్ఞానము వడసెను । గురుదయ నణిమాదికాష్ట గుణములతోడన్. 2

ప్రతిపదార్థం: గురు, కులమునందున్= ఆచార్యుడి ఇంటిలో; గురులకున్= పెద్దలకు (గురువులకు); పరిచర్యలు= సేవలు; ఒనర్చి= చేసి; తాన్=తాను; అపరిమిత, నిష్ఠా పరుఁడు+ఐ= అధిక మైన దీక్షయందు (భక్తిలో ఆసక్తి కలవాడై); గురుదయన్= గురువుల దయచేత; అణిమ+అదిక+అష్టగుణముల తోడన్= అణిమ మొదలైన ఎనిమిది సిద్ధులతోకూడ; జ్ఞానము; పడసెను= పొందినాడు.

తాత్పర్యం: గురుగృహంలో పూజ్యు లైన పెద్దలకు సేవలు చేసి అధికమైన భక్తియందు ఆసక్తికలవా డై గురువుల దయతో అణిమ గరిమ మొదలైన ఎనిమిదిసిద్ధులతోకూడ జ్ఞానాన్ని సాధించాడు.

విశేషం: అణిమ, లఘిమ, ప్రాప్తి, ప్రాకామ్యం, మహిమ, ఈశిత్వం, వశిత్వం, కామావసాయిత అనేవి ఎనిమిదీ అష్టసిద్ధులు. అణిమ అంటే చిన్నరూపం పొందటం; కామావసాయిత అంటే కోరికలను అరికట్టటం. ఈపద్యంలోని వివరాలు అతని స్వభావాన్ని తెలపటమే కాకుండా భావికథలో ఆపాత్రను అర్థం చేసికొనటానికి సార్థకాలుగా తోడ్పడతాయి. కథను ప్రసన్నం చేసే కథాశిల్పంలో భాగంగా సార్థకవిశేషణాలను వాడటం నన్నయరచనలో కానవచ్చే ఒకవిశేషం.

వ. అయ్యుదంకుండు గురుహిత కార్యధురంధరుం డయి గురుపత్నీ నియోగంబునం బౌష్యుం డను రాజుదేవి కుండలంబులం బ్రతిగ్రహించి తేరంబూని, వనంబులో నొక్కరుండ చనువాఁ డెదుర నొక్క మహోక్షంబు నెక్కి చనుదెంచువాని నొక్క దివ్యపురుషుం గని, వాని పన్నిన వృషభగోమయ భక్షణంబు సేసి, యమ్మహాత్ము ననుగ్రహంబు వడసి, యతిత్వరితగతిం జని, పౌష్యమహారాజుం గాంచి, దీవించి, గృహీత సత్కారుం డై యి ట్లనియె. 3

ప్రతిపదార్థం: ఆ+ఉదంకుండు; గురు, హిత, కార్య, ధురంధరుండు+అయి= గురువు గారికి ఇష్టమైన పని యొక్క భారాన్ని వహించే వాడై; గురుపత్నీ,

నియోగంబునన్= గురువుగారి భార్యయొక్క ఆజ్ఞచేత; పౌష్యుండు+అను, రాజుదేవి= పౌష్యు డనే రాజుభార్యయొక్క; కుండలంబులన్= కర్ణాభరణాలను; ప్రతిగ్రహించి= పుచ్చుకొని; తేరన్, పూని= తేవటానికి యత్నించి; వనంబులోన్= అడవిలో; ఒక్కరుండు+అ= ఒక్కడే; చను, వాఁడు= వెళ్లేవాడు; ఎదురన్= తన ఎదుట; ఒక్క, మహత్+ఉక్షంబున్= ఒక పెద్ద ఎద్దును; ఎక్కి; చనుదెంచువానిన్= వచ్చేవాడిని; ఒక్క దివ్యపురుషున్; కని= చూచి; వాని, పన్నిన= (కర్తృపద ప్రథమకుషష్ఠి) అత డేర్పరచిన; వృషభ, గోమయ, భక్షణంబు= ఎద్దుపేడను తినటం; చేసి; ఆ, మహాత్మ+అనుగ్రహంబు= మహానుభావు డైన ఆదివ్యపురుషుడి దయ; పడసి= పొంది; అతి, త్వరితగతిన్= మిక్కిలి వేగంతో కూడిన గమనంతో; చని= వెళ్ళి; పౌష్య, మహా, రాజున్= పౌష్యుడనే పేరు కల ఆ గొప్పరాజును; కాంచి= చూచి; దీవించి= ఆశీర్వదించి; గృహీత, సత్కారుండు+ఐ= గ్రహింపబడిన సన్మానం కలవాడై; ఇట్లు= ఈవిధంగా; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: ఆ ఉదంకుడు గురువుగారి కిష్టమైనపనిని నెరవేర్చేవా డై, గురువు గారిఆజ్ఞచేత పౌష్యు డనే మహారాజు యొక్క దేవేరికర్ణాభరణాలు దానంగా పుచ్చుకొని తేవటానికి పూనుకొని, అడవిలో ఒక్కడే వెళ్ళుతూ తన ఎదుట ఒక పెద్దఎద్దునెక్కి వస్తున్న ఒక దేవతాపురుషుడిని చూచి, అతడు నియోగించిన ఎద్దుపేడ తిని, ఆ మహానుభావుడి దయ పొంది మిక్కిలివేగంతో కూడిన గమనంతో వెళ్ళి పౌష్యమహారాజును చూచి ఆశీర్వదించి, అత డిచ్చిన అర్ఘ్యపాద్యాదిసత్కారాలు గ్రహించి ఇట్లా పలికాడు.

విశేషం: "ఆచార్యాయ ప్రియం ధనమాహృత్య ప్రజాతంతుం మా వ్యవచ్ఛేచ్ఛీః " (గురువు కోరిన అర్థాన్ని గురుదక్షిణగా ఇచ్చి వంశాభివృద్ధికి తోడ్పడుము) అని ఉపనిషత్తులు ఘోషిస్తున్నవి. గురువుకు కోరిక లేదు. అందువలన గురుపత్ని ఉదంకుడిని నియోగించింది. గురువుగారికి భార్యయందున్న అనురాగం, శిష్యుడి

యందున్న వాత్సల్యం ఈ సన్నివేశంలో వస్తుధ్వని, గురుకార్యనిర్వహణానికి పూనుకొన్న ఉదంకుడు ధర్మవీరుడు. అతడి ఉత్సాహానికి మెచ్చి వీరరసాధిదేవత అయిన ఇంద్రుడు ప్రత్యక్షమై అమృతసేవనం చేయిస్తాడు. ధర్మసాధనమే మానవులకు అమృతత్వసిద్ధి అని దివ్యపురుషుడి వృత్తాంతం ధ్వనింపజేస్తున్నది. కథచివరకు తెలిసే ఈసత్యం నన్నయగారి ప్రసన్నకథాకలి(వి)తార్థయుక్తికి ఉదాహరణం. మూలంలో దివ్యపురుషుడు గోమయభక్షణం చేయుమంటే మొదట ఉదంకుడు అంగీకరించలేదు. 'మీ గురువుకూడా ఈ గోమయభక్షణం చేసినవాడే' అని దివ్యపురుషుడు చెప్పి ఒప్పించిన తరువాత ఉదంకుడు సమ్మతించాడు. నన్నయ దీనిని వదలివేసి ఉదంకుడి ఉపజ్ఞను ఉద్దీపింపజేశాడు.(సంసా.)

తే. ఏను గుర్వర్థ మర్థి నై మానవేశ! ।
కడఁగి వచ్చితి నిపుడు నీకడకు వేడ్క;
దండితారాతి! నీ దేవికుండలమ్ము ।
లిమ్ము నా పూన్కి యిది సఫలమ్ము గాఁగ. 4

ప్రతిపదార్థం: మానవ+ఈశ= ఓ రాజా!; ఏను= నేను; గురు+అర్థము= గురువుగారి నిమిత్తం; అర్థిని+ఐ= యాచించేవాడినై; కడఁగి= పూని; ఇపుడు; నీకడకున్= నీచెంతకు; వేడ్కన్= సంతోషంతో; వచ్చితిన్; దండిత+అరాతి!= శిక్షింపబడిన శత్రువులు కలవాడా!; నా, పూన్కి+ఇది= ఈ నా ప్రయత్నం; సఫలమ్ము, కాఁగన్= ఫలంతో కూడినట్లు అయ్యేటట్లుగా; నీ, దేవి కుండలములు= నీరాణి ధరించే కర్ణాభరణాలు; ఇమ్ము.

తాత్పర్యం: ఓ రాజా ! నేను గురువుగారిప్రయోజనంకొరకు యాచకుడ నై పూని ఇపుడు సంతోషంతో నీచెంతకు వచ్చాను. శిక్షింపబడిన శత్రువులు కల ఓ రాజా! నా ఈ కోరిక (ప్రయత్నం) సిద్ధించేటట్లుగా నీ రాణి ధరించే కర్ణాభరణాలు నా కిమ్ము.

విశేషం: గురు+అర్థము= గుర్వర్థము - యణాదేశసంధి.

వ. అనినం బౌష్యుం డిట్టి మహాత్మున కీఁ గాంచితిఁ గృతార్థుండ నైతి నని సంతసిల్లి యుదంకున కి ట్లనియె: 'నయ్యా! మదీయ ధర్మపత్ని యక్కుండ లంబులు దొడిగి యున్న యది; మద్వచనంబున వాని నిప్పించుకొ' మ్మనిన నుదంకుం డంతఃపురమునకుఁ జని పౌష్యమహాదేవిం గానక క్రమ్మఱి పౌష్యపాలికి వచ్చి. 'నీదేవి నందులం గాన నీవ 'యక్కుండలంబులు దెప్పించి యి' మ్మనినఁ బౌష్యుం డి ట్లనియె. 5

ప్రతిపదార్థం: అనినన్= అని ఉదంకుడు పలుకగా; పౌష్యుండు; ఇట్టి, మహత్, ఆత్మునకున్= ఇటువంటి మహానుభావుడికి (గొప్ప మనస్సు కలవాడికి), ఈన్, కాంచితిన్= కుండలాలు ఈయ జాలినాను; కృత+అర్థుండన్+ఐతిన్= ధన్యుడ నైనాను; అని; సంతసిల్లి= సంతోషించి; ఉదంకునకున్; ఇట్లు= ఈవిధంగా; అనియెన్; అయ్యా= ఆర్యా! (ఉదంకుడికి సంబోధన); మదీయ, ధర్మ పత్ని= నాయిల్లాలు (యథావిధిగా గృహస్థ ధర్మాన్ని నిర్వహించటానికి పెండ్లాడిన భార్య); ఆ+కుండలములు; తొడిగి, ఉన్న, అది= ధరించి ఉన్నది; మత్+వచనంబునన్= నామాటచేత (నేను ఇమ్మన్నా నని;) వానిన్= ఆ కుండలాలను, ఇప్పించుకొమ్ము= ఇచ్చేటట్లు చేసికొనుము; అనినన్= అని పౌష్యుడు పలుకగా; ఉదంకుండు; అంతః పురమునకున్= రాణివాసపుస్త్రీలు ఉండే సౌధభాగానికి; చని= వెళ్ళి; పౌష్య, మహా, దేవిన్= పౌష్యుని పట్టమహిషిని; కానక= చూడక; క్రమ్మఱి= తిరిగి; పౌష్య, పాలికిన్= పౌష్యుని చెంతకు; వచ్చి; నీ, దేవిన్= నీరాణిని; అందులన్= అంతఃపురంలో; కానన్= చూడను (ఆమె కనబడలేదు); నీవు+అ= నీవే; ఆ+కుండలంబులు; తెప్పించి= తెచ్చేటట్లు చేసి; ఇమ్ము; అనినన్= అని ఉదంకుడు పలుకగా; పౌష్యుండు; ఇట్లు= ఈవిధంగా; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: అని ఉదంకుడు అడుగగా పౌష్యుడు 'ఇట్టి మహానుభావుడికి (పాత్రునికి) అడిగిన కుండలాలను ఈయజాలినాను; ధన్యుడ నైనాను' అని సంతోషించి ఉదంకుడితో 'ఆర్యా! నా దేవేరి ఆ కుండలాలను ధరించి

ఉన్నది. నామాటగా వాటిని ఆమెనుండి గ్రహించండి' అని పలుకగా, ఉదంకుడు రాణి నివసించే అంతఃపురానికి వెళ్ళి పౌష్యుని పట్టమహిషి కనబడక తిరిగి పౌష్యమహారాజుచెంతకు వచ్చి 'నీదేవేరిని అంతఃపురంలో చూడలేకపోయాను; నీవే ఆ కుండలాలను నాకై తెప్పించి యిమ్ము' అని పలుకగా పౌష్యుడు ఇట్లా అన్నాడు.

విశేషం: ఇచ్చునకు ప్రేరణార్థకరూపం ఇప్పించు; కొనుము= మధ్యమపురుష మందలి ము, డు ప్రత్యయములు పరము లయ్యేటపుడు కొనునకు కో బహుళంగా ఔతుంది. కొమ్ము; తరువాత దీర్ఘమునకు హ్రస్వమును ముప్రత్యయమునకు ద్విత్వమును వస్తాయి. అక్కుండలంబులు దొడిగియున్న యది' - అనేపాఠానికి 'అక్కుండలంబులు దొడుగనవసరంబై యున్నయది' అనే పాఠాంతరం ఉన్నది.

క. భూవినుత! నిన్నుఁ ద్రిభువన ।
పావను నశుచి వని యెట్లు పలుకఁగ నగు?
నద్దేవి పవిత్ర, పతివ్రత ।
గావున నశుచులకుఁ గానఁగా దనవద్యా! 6

ప్రతిపదార్థం: భూ, వినుత= భూమియందలి జనులచేత స్తుతింపబడేవాడా!; అనవద్యా= దోషరహితుడా!; త్రి, భువన, పావనున్= ముల్లోకాలను పవిత్రం చేసేవాడిని; నిన్నున్; అశుచివి+అని= శుద్ధుడవు కావని; ఎట్లు= ఏవిధంగా; పలుకఁగన్+అగున్= పలుక వచ్చును? (పలుక రాదు అనిభావం); ఆ+దేవి= ఆ నాదేవేరి; పవిత్ర= పవిత్రురాలు; పతి వ్రత= (భర్తయే వ్రతంగా కలది) పతిభక్తి కల ఇల్లాలు; కావునన్= అగుటచేత; అశుచులకున్= అపవిత్రులకు; కానన్, కాదు= చూడరాదు (కనబడదు).

తాత్పర్యం: భూప్రజలచే స్తుతింపబడేవాడా! దోషరహితుడా! ముల్లోకాలను పవిత్రంచేయ గల నిన్ను అపవిత్రుడ వని చెప్పటం ఎట్లా? చెప్పరాదు. ఆ నాదేవి పవిత్రురాలు. పతిభక్తి కలది. కావున అపవిత్రులకు చూడ శక్యం కాదు.

విశేషం: ఉదంకుడు పరమ పవిత్రుడు; పౌష్యునిదేవి పరమ పవిత్ర. మహాపతివ్రత. అపవిత్రులకు కనబడదు. ఉదంకుడికి కనబడలేదు. అతడిని అపవిత్రు డని ఎట్లా చెప్పటం? అని పౌష్యునిభావం. ఇందులో అర్థాంతరసంక్రమిత వాచ్యధ్వని ఉన్నది. (సంపా.)

వ. అనిన విని యుదంకుం డప్పుడు దలంచి 'యావృషభగోమయభక్షణానంతరంబున నాచమింపమి నైన నా యశుచిభావంబునఁ గా కేమి యప్పరమ పతివ్రత మదీయదృష్టి గోచర గాకున్నదయ్యె' నని పూర్వాభిముఖుం డయి శుద్ధోదకంబు లంబ్రక్షాళి తపాణిపాద వదనుండయి యాచమించి పౌష్యాను మతంబున నద్దేవియొద్దకుం జనిన, నదియును నమ్మహామునికి నమస్కరించి కుండలమ్ము లిచ్చి యి ట్లనియె. 7

ప్రతిపదార్థం: అనినన్= పౌష్యు డావిధంగా పలుకగా; విని; ఉదంకుండు; అప్పుడు= పౌష్యు డావిధంగా పలికినప్పుడు; తలంచి= ఆలోచించి(వెనుకటి విషయాలను స్మృతికి తెచ్చుకొని); ఆ, వృషభ, గోమయ, భక్షణ+అనంతరంబునన్= దివ్యపురుషుడు చెప్పినట్లు ఆ ఎద్దుపేడ తినిన తరువాత; ఆచమింపమిన్= (చూపుడువేలు పొడవుగా నిల్పిన పుడిసిటి జలాన్ని మూడుసార్లు గ్రహించటమే ఆచమించటం) అట్లా చేయకపోవటం చేత; ఐన= కలిగిన; నా= నాయొక్క; అశుచిభావంబునన్, కాక+ఏమి= అపవిత్రత్వం వలన కాక మరేమి కారణాన; ఆ+పరమపతివ్రత= గొప్ప పతిభక్తి కల ఆ పౌష్యునిదేవి; మదీయ, దృష్టి, గోచర= నాచూపునకు కనబడేది; కాక+ఉన్నది+అయ్యెన్= కాకుండ ఉన్నది అయినది (నాకు కనబడలేదు) అని; పూర్వ+అభిముఖుండు= తూర్పుదిక్కుకు ఎదురుగా ముఖం కలవాడు; అయి; శుద్ధ+ఉదకంబులన్= పవిత్రమైన నీళ్ళతో, ప్రక్షాళిత, పాణి, పాద, వదనుండు+అయి= కడుగబడిన చేతులు, కాళ్ళు ముఖం కలవాడై; ఆచమించి= పవిత్రత కొరకు మూడుసార్లు జలం త్రాగి (వార్చి); పౌష్య+అనుమతంబునన్= పౌష్యునియొక్క అంగీకారంతో; ఆ+దేవి+ఒద్దకున్= ఆ రాణిచెంతకు; చనినన్= వెళ్ళగా; అదియును= ఆ దేవికూడ; ఆ+మహత్,

మునికిన్= గొప్పముని అయిన ఆ ఉదంకుడికి; నమస్కరించి= మ్రొక్కి; కుండలంబులు= కర్ణాభరణాలు; ఇచ్చి; అతనికి ఇచ్చి; ఇట్లు= ఈవిధంగా; అనియెన్; పలికింది.

తాత్పర్యం: పౌష్యుడు ఆవిధంగా పలుకగా విని ఉదంకుడు ఆలోచించి, దివ్యపురుషుడు చెప్పినట్లు ఎద్దుపేడ తినినతరువాత పరిశుద్ధికై ఆచమనం చేయకపోవటంచేత కలిగిన అపవిత్రతచే కాక మరేకారణాన ఆమహాపతివ్రత (పౌష్యునిదేవి) నాచూపునకు కనబడ దని తలంచి, తూర్పుదిక్కుగా తిరిగి పవిత్రమైన జలాలతో కడుగబడిన చేతులు, పాదాలు, ముఖం కలవా డై ఆచమనం చేసి, పౌష్యమహారాజుఅనుమతితో అతడి దేవేరిచెంతకు పోగా, ఆ దేవి మహాముని అయిన ఉదంకుడికి నమస్కారంచేసి తన కర్ణాభరణాలు ఇచ్చి ఇట్లా పలికింది.

క. తక్షకుఁ డీ కుండలము ల ।
పేక్షించుచు నుండు వాఁ డభేద్యుఁడు మాయా
దక్షుండు వానివలన సు ।
రక్షితముగఁ జేసి చనుము రవినిభతేజా ! 8

ప్రతిపదార్థం: రవి, నిభ, తేజా= సూర్యుడితో సమాన మైన కాంతి కల ఓ మహామునీ!; తక్షకుఁడు= తక్షకు డనే పేరు కల సర్పరాజు; ఈ+కుండలములు= నేను ధరించే ఈ కర్ణాభరణాలను; అపేక్షించుచున్+ఉండున్= కోరుతూ ఉంటాడు; వాఁడు= ఆ తక్షకుడు; అభేద్యుఁడు= భేదించటానికి (జయించటానికి) శక్యం కానివాడు; మాయా, దక్షుండు= మాయ (వంచన) యందు మిక్కిలి సమర్థుడు; వానివలనన్= ఆ తక్షకుడివలన; సురక్షితముగన్= లెస్సగా కాపాడబడిన వాటినిగా; చేసి= ఈ కుండలాలను భద్రపరిచికొని; చనుము= వెళ్ళుము.

తాత్పర్యం: సూర్యుడితో సమానమైన తేజం గల ఓ ఉదంకమహామునీ! నేను ధరించే ఈ కుండలాలను తక్షకు డనే సర్పరాజు తాను పొందాలని

కోరుకొంటూ ఉంటాడు. అతడు భేదింపశక్యం కానివాడు, మాయయందు మిక్కిలి సమర్థుడు. ఈ కుండలాలను ఆతడు అపహరించకుండ లెస్సగా భద్రపరచికొంటూ వెళ్ళుము.

విశేషం: పౌష్యుడిదేవి కుండలాలవిషయంలో జాగరూకుడవై ఉండు మని ఉదంకుడిని ముందే హెచ్చరించింది.

వ. అనిన నుదంకుం 'డట్ల చేయుదు' నని యద్దేవి వీడ్కొని పౌష్యుపాలికిం బోయిన, నతం 'డయ్యా! నీ వతిథివి మాయింటఁ గృతభోజనుండవై పొ' మ్మని క్షణియించిన, నొడంబడి యుదంకుండు గుడుచుచో నన్నంబు కేశదుష్టం బైన రోసి, కరం బలిగి 'యి ట్ల పరీక్షితం బైన యశుద్ధాన్నంబు పెట్టినవాఁడ వంధుండ వగు' మని శాపం బిచ్చిన, నల్గి 'యల్పదోషంబున నాకు శాపం బిచ్చినవాఁడవు నీ వనపత్యుండ వగు' మని ప్రతిశాపం బిచ్చిన, నుదంకుండు 'నే ననపత్యుండఁ గా నోప, దీనిఁ గ్రమ్మఱింపు' మనినఁ బౌష్యుం డి ట్లనియె. 9

ప్రతిపదార్థం: అనినన్= దేవి ఆవిధంగా పల్కగా; ఉదంకుండు; అట్లు+అ= అట్లే; చేయుదున్+అని; ఆ+దేవి= ఆరాణిని; వీడ్కొని= పోయివస్తా నని చెప్పి విడిచి; పౌష్య, పాలికన్= పౌష్యమహారాజుచెంతకు; పోయినన్= వెళ్లగా; అతండు= ఆ పౌష్యుడు; అయ్యా= నీవు; అతిథివి= అతిథిగా వచ్చినవాడవు; మా, ఇంటన్= మాయింటియందు; కృత, భోజనుండవు+ఐ= చేయబడిన భోజనం కలవాడ వై; పొమ్ము+అని= వెళ్ళు మని; క్షణియించినన్= భోజనార్థం కోరగా; ఒడంబడి= అంగీకరించి; ఉదంకుండు; కుడుచుచోన్= భోజనం చేస్తున్నప్పుడు; అన్నంబు; కేశ, దుష్టంబు+ఐనన్= వెంట్రుకచేత అపవిత్రం కాగా; రోసి= అసహ్యించుకొని; కరంబు= మిక్కిలి; అలిగి= కోపించి; ఇట్లు= ఈవిధంగా అపరీక్షితంబు+ఐన= పరీక్షింపబడని; అశుద్ధ+అన్నంబు= అపవిత్ర మైన అన్నాన్ని; పెట్టినవాడవు; అంధుండవు= గ్రుడ్డివాడవు;

అగుము+అని; కమ్మని; శాపంబు, ఇచ్చినన్= శాప మీయగా; అల్గి= కోపించి; అల్ప, దోషంబునన్= చిన్నతప్పుచేత; నాకున్; శాపంబు+ఇచ్చినవాడవు; నీవు; అనపత్యుండవు= సంతానం లేనివాడవు; అగుము= కమ్ము; అని ప్రతిశాపంబు+ఇచ్చినన్= అని తిరిగి శాపం ఈయగా; ఉదంకుండు= ఉదంకుఁడు; నేను; అనపత్యుఁడన్= సంతానంలేనివాడను; కాన్, ఓపన్= కాజాలను; దీనిన్= ఈ శాపాన్ని; క్రమ్మఱింపుము= తొలగింపుము; అనినన్= అని పలుకగా; పౌష్యుండు; ఇట్లు ఈవిధంగా; అనియెన్= పలికాడు.

తాత్పర్యం: దేవి ఆవిధంగా పలుకగా ఉదంకుడు 'అట్లే చేస్తా' నని ఆ దేవివద్ద సెలవు తీసికొని పౌష్యుని చెంతకు వెళ్ళగా పౌష్యుడు 'ఆర్యా! నీవు అతిథివి. మా ఇంటిలో భోజనం చేసి వెళ్ళు' మని కోరగా అంగీకరించి ఉదంకుడు భోజనం చేసేటప్పుడు అన్నం వెంట్రుకచేత అపవిత్రం కాగా ఏవగించుకొని మిక్కిలి కోపించి 'ఈవిధంగా పరీక్షింపబడని అపవిత్ర మైన అన్నం పెట్టావు. గ్రుడ్డివాడ వగుము' అని పౌష్యుడికి శాప మిచ్చాడు. అంతట పౌష్యుడు కోపగించి 'చిన్నతప్పునకు నాకు శాప మిచ్చావు, నీవు సంతానం లేనివాడ వగుము' అని మారుశాపం ఇచ్చాడు. అప్పుడు ఉదంకుడు నేను సంతానం లేనివాడను కాలేను. ఈ శాపాన్ని ఉపసంహరించుము' అని పల్కగా పౌష్యుడు, ఈవిధంగా అన్నాడు.

విశేషం: పౌష్యోదంకులు ఆవేశంతో పరస్పరం శాపాలిచ్చుకొన్నవారివలె పైకి కనపడతారు. 'లోనారసి' చూస్తే వారిచర్యలకు హేతువులు గోచరిస్తాయి. అపరీక్షితమైన అన్నం పెట్టినందుకు పౌష్యుడిని గ్రుడ్డివాడయ్యేటట్లు శపించాడు ఉదంకుడు. పరీక్షించేవి కళ్ళుకాబట్టి, వాటిని ఉపయోగించలేదని గ్రుడ్డితనం రావాలని శపించాడు. గురుదక్షిణ నిచ్చిన శిష్యుడికి సత్సంతానం కలుగుతుందని ఉపనిషద్వాక్యం. ఉదంకుడు గురుదక్షిణనిచ్చి సేవచేస్తే అతనికి కలిగేది వంశాభివృద్ధి. అతనికి అదిలేకుండా పౌష్యుడు అతనికి సంతానం కలుగకుండా ఉండే శాపాన్ని పెట్టాడు. ఉదంకుడు ఆశాపాన్ని భరించలేక, దానిని ఉపసంహరించుకోమని పౌష్యుడిని ప్రార్థించటం తన గురుశుశ్రూషాఫలం

నిష్ఫలమైపోయిందన్న నిర్వేదంతోనే. ఈవివరాలు నన్నయ కథలో చెప్పడు. సారమతులైనవారు లోనారసి తెలిసికొనేవి అని భావించాడు. ఇది వస్తుధ్వని. ప్రసన్నకథాకలితార్థయుక్తి. (సంపా.)

ఉ. నిండుమనంబు నవ్యనవనీతసమానము, పల్కుదారుణా
ఖండలశస్త్రతుల్యము జగన్నుత! విప్రులయందు; నిక్క మీ
రెండును రాజులందు విపరీతము; గావున విప్రుఁ డోపు, నో
పం డతిశాంతుఁ డయ్యు నరపాలుఁడు శాపము గ్రమ్మఱింపఁగన్. 10

ప్రతిపదార్థం: జగత్+నుత= లోకంచేత స్తుతింపబడినవాడా!; విప్రులయందున్= బ్రాహ్మణులందు; నిండు, మనంబు= పూర్ణమైన హృదయం; నవ్య, నవనీత, సమానము= కొత్తగా తీసిన వెన్నతో సమానం; పల్కు= మాట; దారుణ+అఖండల, శస్త్ర, తుల్యము= భయంకరమైన ఇంద్రుడిఆయుధ మైన వజ్రంతో సమానమైనది; నిక్కము= నిజం; ఈ రెండును= హృదయం, పల్కు అనే రెండున్నూ; రాజులందున్= క్షత్రియులందు; విపరీతము= విరుద్ధం (అంటే హృదయం వజ్రసమానం, పల్కు వెన్నతో సమానం); కావునన్= అందుచేత; విప్రుఁడు= బ్రాహ్మణుడు; శాపము= ఇచ్చిన శాపాన్ని; క్రమ్మఱింపఁగన్= తొలగించటానికి; ఓపున్= శక్తుడౌతాడు; అతిశాంతుఁడు+అయ్యున్= మిక్కిలి శాంతస్వభావంతో కూడిన వా డైనప్పటికి; నర, పాలుఁడు= రాజు; ఓపండు= శాపం తొలగించటానికి శక్తుడు కాడు.

తాత్పర్యం: లోకంచేత స్తుతింపబడినవాడా! ఉదంకమహాముని! బ్రాహ్మణులలో వారి నిండుహృదయం అప్పుడే తీసిన వెన్నతో సమానంగా మిక్కిలి మృదువుగా ఉంటుంది, మాట భయంకరమైన ఇంద్రుని వజ్రాయుధంతో సమానంగా ఉంటుంది, పరుషమైనది. ఇది నిజం. మనసూ, హృదయమూ అనే ఆ రెండున్నూ రాజులలో అందుకు విరుద్ధంగా ఉంటాయి. అంటే రాజులందు మనస్సు వజ్రతుల్యంగానూ, పల్కు నవనీతంగానూ

ఉంటాయి. కాబట్టి బ్రాహ్మణుడు ఇచ్చిన శాపాన్ని ఉపసంహరించుకొనటానికి శక్తు డౌతాడు. మిక్కిలి శాంతస్వభావం కలవా డైనా రాజు ఉపసంహరించు కోవటానికి శక్తుడు కాడు.

విశేషం: అలం: కావ్యలింగం. ఈపద్యం సుప్రసిద్ధ మైనది. మనోవాక్కుల విషయంలో బ్రాహ్మణులకు రాజులకూ ఉండే భేదాన్ని ఇది వివరిస్తున్నది. రాజు మనస్సు కఠినం కాబట్టి తా నిచ్చిన శాపాన్ని ఉపసంహరింపజాల నని పౌష్యుడు చెప్పాడు. నన్నయ రుచిరార్థసూక్తి కిది ఉదాహరణం. మూలంలో విప్రులపల్కు మంగలికత్తితో పోల్చబడింది. నన్నయ ఔచిత్యాన్ని పాటించి 'దారుణాఖండల శస్త్రతుల్య' మని ఉపమించాడు. నన్నయరచనలో శబ్దగుణా లెక్కువ. వాటిల్లోకూడా ప్రసాదగుణం విస్తారంగా ప్రయోగింప బడుతుంది. బంధశైథిల్యం, అర్థనైర్మల్యం అనే శబ్దార్థగుణాలను రెండింటినీ పోషించిన పద్యమిది. అందువల్లనే ప్రసిద్ధమై ప్రజలనాల్కలమీద నిలిచింది. (సంపా.)

తక్షకుండు కుండలంబు లపహరించుట (సం. 1-3-136)

వ. 'కావున నా కశక్యంబు నీ యిచ్చిన శాపంబు గ్రమ్మఱింపు' మనిన నుదంకుం 'డట్లేని నీకు నల్పకాలంబున శాపమోక్షం బగు' నని పౌష్యునకు ననుగ్రహించి, 'మగుడి నేఁడ పోయి గురుపత్నికిఁ గుండలంబు లీఁగంటి' నని సంతోషించి చనువాఁ డెదుర నొక్క జలాశయంబు గని శుచి ప్రదేశంబునఁ దనచేతి కుండలంబులు పెట్టి యాచమించుచున్నంతఁ దనతోడన వచ్చి తక్షకుండు నగ్నవేషధరుండై యక్కుండలంబులు గొని పాఱిన, నుదంకుండును వాని పిఱుందన పాఱి పట్టికొనుడు. 11

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి (రాజులహృదయం వజ్రకఠినం కాబట్టి); నాకున్; అశక్యంబు= (శాపం తొలగించటానికి) శక్యం కాదు; నీ ఇచ్చిన= (కర్తృపద ప్రథమకు షష్ఠి) నీ విచ్చిన; శాపంబు; క్రమ్మఱింపుము= తొలగింపుము; అనినన్= అని పౌష్యుడు పల్కగా; ఉదంకుండు; అట్లు+ఏని= నీకు శాపం ఉపసంహరించటానికి శక్తి లేకపోతే; నీకున్; అల్పకాలంబునన్= కొలదికాలంలోనే; శాప+మోక్షంబు= శాపం వలన విడుదల; అగున్+అని; పౌష్యునకున్= పౌష్యుడిని; అనుగ్రహించి= కరుణించి; మగుడి= తిరిగి; నేఁడు+అ= ఆరోజే; పోయి= వెళ్ళి, గురుపత్నికిన్= గురువుగారిభార్యకు, కుండలంబులు= ఆమె తెమ్మనిన కర్ణాభరణాలు; ఈన్, కంటిన్, అని= ఈయజాలితిని అని; సంతోషించి= ఆనందించి; చనువాఁడు= వెళ్ళువాడు, ఎదురన్= తన ఎదుట; ఒక్క; జల+ఆశయంబు= సరస్సును; కని= చూచి, శుచి, ప్రదేశంబునన్= శుద్ధ మైన స్థలంలో; తన చేతి, కుండలంబులు= తన చేతిలో ఉన్న కర్ణాభరణాలను; పెట్టి= ఉంచి; ఆచమించుచున్, ఉన్న+అంతన్= ఆచమనం చేస్తూ ఉండగా; తనతోడన్= తనవెంటనే; వచ్చి; తక్షకుండు= తక్షకుడు అనే పేరు కల సర్పరాజు; నగ్న, వేష, ధరుండు+ఐ= దిగంబర వేషాన్ని ధరించినవాడై; ఆ కుండలాలు= పౌష్యుని దేవి ఇచ్చిన కుండలాలు, కొని= తీసికొని; పాఱినన్= పరుగెత్తిపోగా; ఉదంకుండును= ఉదంకుడు కూడ; వాని, పిఱుందన్+అ= ఆ తక్షకుని వెనుకనే; పాఱి= పరుగెత్తి, పట్టికొనుడున్= అతనిని పట్టుకొనిన అనంతరం.

తాత్పర్యం: 'కాబట్టి శాపం తొలగించటం నాకు శక్యం కాదు; నీ విచ్చిన శాపమే తొలగింపుము' అని పౌష్యుడు పలుకగా ఉదంకుడు 'అట్లైతే నీకు కొద్దికాలంలోనే శాపంనుండి విముక్తి కలుగుతుం' దని (గ్రుడ్డితనం పోతుందని) పౌష్యుడిని కరుణించి, 'తిరిగి ఈరోజే వెళ్ళి గురువుగారిభార్యకు ఆమె కోరినట్లు కుండలాలను ఈయగలిగాను' అని సంతసించి వెళ్ళుతూ తన ఎదుట ఒకసరస్సును చూచి, పవిత్రస్థలంలో తనచేతిలో ఉన్న కుండలాలను ఉంచి ఆచమనం చేస్తూ ఉండగా, అతని వెంటనే వచ్చి తక్షకుడనే సర్పరాజు దిగంబరవేషం ధరించి ఆకుండలాలు గ్రహించి పరుగెత్తాడు ఉదంకుడుకూడ ఆ తక్షకుడివెనుకనే పరుగెత్తి అతడిని పట్టుకొన్నాడు. తరువాత.

విశేషం: పౌష్యునకు+అనుగ్రహించి= ఇటువంటి చోట్ల నన్నయ ద్వితీయావిభక్తికి బదులుగా షష్ఠీవిభక్తివాడుతూ ఉంటాడు. అప్పటికిని, ఇప్పటికిని ఉన్న కారకభేద మిది. పట్టికొనుడు - 'డు' అనే ప్రత్యయం ఆనంతర్యార్థాన్ని సూచిస్తుంది. చేతి - అనేది చేయి యొక్క ఔపవిభక్తికరూపం.

క. విడిచి దిగంబరవేషము।
విడువక మణికుండలములు విషధరపతి యే
ర్పడ నిజరూపముతో న।
ప్పుడ యహిలోకమున కరిగె భూవివరమునన్. 12

ప్రతిపదార్థం: విష, ధర, పతి= సర్పరాజు (తక్షకుడు); దిక్+అంబర, వేషము= దిక్కులే వస్త్రంగా గల నగ్నవేషం (గుడ్డలు లేని రూపం) విడిచి; మణి, కుండలములు= రత్నమయా లైన చెవికమ్మలను; విడువకు= విడిచిపెట్టక; ఏర్పడన్= తేటపడేటట్లుగా (తాను సర్పరాజని స్పష్టపడేటట్లు); నిజరూపము తోన్= తన సహజమైన రూపంతో; అప్పుడు+అ= వెంటనే; భూవివరమునన్= భూమియందలి కన్నంద్వారా; అహి, లోకమునకున్= నాగలోకానికి (పాతాళలోకానికి), అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: సర్పరాజైన తక్షకుడు నగ్నరూపం విడిచి, రత్నమయాలైన కుండలాలను మాత్రం విడువక, తనసహజ మైన తక్షకరూపంతో వెంటనే భూమిలోని రంధ్రంద్వారా నాగలోకానికి వెళ్ళాడు.

వ. ఉదంకుండును వానితోడన తగిలి యవ్వివరంబున నురగలోకంబున కరిగి నాగపతుల నెల్ల నిట్లని స్తుతియించె. 13

ప్రతిపదార్థం: ఉదంకుండును= ఉదంకుడు కూడ; వానితోడన్+అ= ఆ తక్షకుడితోనే; తగిలి= వెంబడించి; ఆ+వివరంబునన్= ఆ రంధ్రంలో (ద్వారా); ఉరగలోకంబునకున్= నాగలోకానికి; అరిగి= వెళ్ళి; నాగపతులన్, ఎల్లన్= పాములరాజులనందరిని; ఇట్లు+అని= ఈవిధంగా; స్తుతియించెన్= పొగడినాడు.

తాత్పర్యం: ఉదంకుడు కూడ తక్షకుడిని వెంబడించి, ఆ రంధ్రంద్వారా నాగలోకానికి వెళ్ళి, పాములరాజుల నందరిని ఈవిధంగా స్తుతించాడు.

విశేషం: మూలభారతంలో తక్షకుడిని వెంబడించి పట్టుకొనటానికి ఉదంకుడు నేలను త్రవ్వి అలసిపోయాడనీ, ఇంద్రుడు అతడి త్రవ్వుకోలలో వజ్రాయుధశక్తిని ప్రవేశపెట్టాడనీ, దాని మహిమవలన ఉదంకుడు నేలను త్రవ్వి నాగలోకంలో ప్రవేశించాడనీ ఉన్నది. నన్నయ దానిని స్పృశించలేదు. తక్షకుడి వెంట ఉదంకుడు కలుగులోదూరి నాగలోకం చేరినట్లు చెప్పాడు. 1.92వ పద్యంలో గురువు దయవలన ఉదంకుడికి అణిమాద్యష్టసిద్ధులు కలిగాయని నన్నయ వర్ణించాడు. ఉదంకు డా సిద్ధుల ప్రభావంతో ఆ కలుగులోదూరి వెనువెంటనే వెడలగలిగాడని వస్తుధ్వని. పూర్వాపర కథార్థసంవిధానంవలన 'ప్రసన్నకథా కలితార్థయుక్తి' ద్యోతకమౌతుంది. (సంపా.)

చ. బహువన పాదపాబ్ధి కులపర్వత పూర్ణ సరస్సరస్వతీ
సహిత మహామహీభర మజస్ర సహస్ర ఫణాళిఁ దాల్చి దు
స్సహతర మూర్తికిన్ జలధిశాయికిఁ బాయక శయ్య యైన య
య్యహిపతి దుష్కృతాంతకుఁ డనంతుఁడు మాకుఁ బ్రసన్నుఁ డయ్యెడున్. 14

ప్రతిపదార్థం: బహు, వన, పాదప+అబ్ధి, కులపర్వత, పూర్ణ, సరస్+సరస్వతీ సహిత, మహత్, మహీ, భరము= పెక్కు అడవులతోను, చెట్లతోను, సముద్రాలతోను, కుల పర్వతాలతోను, నీటితో నిండిన తటాకాలతోను, నదులతోను కూడిన గొప్ప భూమియొక్క బరువును; అజస్ర, సహస్ర, ఫణ+ఆళిన్= నిరంతరం వేయిపడగల సముదాయంతో; తాల్చి= ధరించి; దుస్సహతర, మూర్తికిన్= మిక్కిలి సహింపశక్యం గాని విగ్రహం కల; జలధిశాయికిన్= సముద్రంలో నిద్రించే నారాయణుడికి; పాయక= విడువక;

శయ్య+ఐన= సెజ్జ ఐన; ఆ+అహిపతి= ఆ నాగరాజు; దుష్కృత+అంతకుఁడు= పాపాలను పోగొట్టేవా డైన; అనంతుఁడు= అనంతు డనే పేరుకల నాగరాజు; మాకున్= మాయెడ; ప్రసన్నుఁడు= ప్రసాదం (అనుగ్రహం) కలవాడు; అయ్యెడున్= అగుగాక!

తాత్పర్యం: పెక్కు అడవులతోను, చెట్లతోను, సముద్రాలతోను, కులపర్వతాలతోను, నీటితో నిండిన సరస్సులతోను, నదులతోను కూడిన గొప్ప భూమియొక్క బరువును ఎల్లప్పుడూ వేయిపడగల సముదాయంతో ధరించి మిక్కిలి సహింపశక్యం కాని విగ్రహం గల నారాయణుడికి విడువక శయ్యగా ఉండి, పాపాలను అంతరింపజేసే అనంతు డనే పేరుగల ఆ నాగరాజు మా పట్ల అనుగ్రహం కలవాడు అగుగాక!

విశేషం: మహేంద్రం, మలయం, సహ్యం, శుక్తిమంతం, గంధమాదనం, వింధ్యం, పారియాత్రం అనే ఏడున్నూ కులపర్వతాలు. విష్ణువు సముద్రంలో ఆదిశేషువుమీద పవళించి ఉంటాడు. ఉదంకుడు ఋషి కాబట్టి 'మాకు' అని బహువచన ప్రయోగం చేశాడు. ఉదంకుడు నాగరాజులను నాలుగు పద్యాలలో స్తుతించాడు. వాటిలో ఇది మొదటిది. ఈ నాల్గు పద్యాల చివరన "మాకు ప్రసన్నుఁడయ్యెడున్" అనే పదాలు ఉన్నవి. తరువాత పలువురు కవులచేత వ్రాయబడిన సమానమకుటం గల శతకాలకు ఈ నాలుగు పద్యాలున్నూ మార్గదర్శకా లయిన వని విమర్శకులు చెప్పారు. మూలంలో లేకపోయినా అనంతవాసుకుల స్తోత్రాలను నన్నయ తెనుగున అధికంగా చేర్చి ఉన్నాడు. నాగరాజులలో శ్రేష్ఠు లవటంచేత వారినికూడ స్తుతించటం ఉచిత మని అతడు భావించి ఉంటాడు. 'మాకు' అనేబహువచనం తనను, తనగురుకులాన్ని మనసులో ఉంచుకొని ఉదంకుడు ప్రయోగించాడు. ఈపద్యంలో నన్నయ అక్షరరమ్యత రమణీయంగా దర్శనమిస్తుంది. భూభారాన్నీ, దానిని మోసే ఆదిశేషుడిని సహస్రఫణాల బుసలను, అనంతునికి శయ్యగా శేషుడు అనంతభారాన్ని మోస్తున్న అంతస్సత్త్వాన్ని ఊష్మాక్షరాలతో, అంతస్థాలతో

ధ్వనింపచేయటం ఇందులోని అక్షరరమ్యత. అక్షరరమ్యతను విభావవిస్ఫూర్తికి వ్యంజకంగా వాడటం నన్నయ రచనాశిల్పం.

చ. అరిది తపోవిభూతి నమరారులబాధలు వొందకుండఁగా
నురగుల నెల్లఁ గాచిన మహోరగనాయకుఁ డానమత్సురా
సురమకుటాగ్రరత్నరుచిశోభితపాదున కద్రినందనే
శ్వరునకు భూషణం బయిన వాసుకి మాకుఁ బ్రసన్నుఁ డయ్యెడున్. 15

ప్రతిపదార్థం: అరిది= దుర్లభమైన; తపః, విభూతిన్= తపస్సుయొక్క వైభవం చేత; అమర+అరుల= దేవతలయొక్క శత్రువు లైన రాక్షసుల; బాధలు; పొందక, ఉండఁగాన్= పొందకుండ ఉండేటట్లుగా; ఉరగులన్, ఎల్లన్= పాములనందరిని; కాచిన= రక్షించిన; మహత్+ఉరగనాయకుఁడు= గొప్ప పాములరాజు; ఆనమత్, సుర+అసుర, మకుట+అగ్ర, రత్న, రుచి, శోభిత, పాదునకున్= తనకు నమస్కరించే దేవతల యొక్కయు, రాక్షసులయొక్కయు కిరీటాల పైభాగంలో ఉన్న మణులకాంతితో ప్రకాశించే పాదాలు కలవాడికి; అద్రినందన+ఈశ్వరునకున్= హిమవత్పర్వతానికి కూతు రైన పార్వతికి భర్త అయిన శివుడికి; భూషణంబు+అయిన= అలంకారమైన; వాసుకి= వాసుకి అనే పేరుగల సర్పరాజు; మాకున్= మాయెడ; ప్రసన్నుఁడు= అనుగ్రహం కలవాడు; అయ్యెడున్= అగుగాక!

తాత్పర్యం: చేయ శక్యంగాని తపస్సుయొక్కవైభవంచేత రాక్షసులు పెట్టేబాధలు పొందకుండేటట్లుగా నాగులనందరినీ రక్షించిన గొప్ప సర్పరాజున్నూ, వంగి నమస్కరించే దేవతలయొక్కయు రాక్షసులయొక్కయు కిరీటాలపైభాగాల నున్న మణులకాంతిచేత ప్రకాశించే పాదాలు కల పార్వతీపతి యైన శివుడికి అలంకార మైన వాసుకి అనే సర్పరాజు మాయెడ అనుగ్రహం కలవాడు అగుగాక!

విశేషం: ఈపద్యంలో నన్నయ అక్షరరమ్యత సార్థకంగా ఆవిష్కరించబడింది. సర్పకులాన్ని రక్షించిన ఉదారుడూ, శివుడి కంఠాభరణంగా నిలిచిన ఉదాత్తుడూ అయిన వాసుకి స్వభావాన్ని ఊష్మాక్షరాలకంటె అంతస్థాలతోనూ, నాదాక్షరాలతోనూ ధ్వనింపజేయటం ఇందులోని రచనాశిల్పం.

ఉ. దేవమనుష్యలోకములఁ ద్రిమ్మరుచున్ విపులప్రతాపసం
భావితశక్తిశౌర్యులు నపారవిషోత్కటకోపవిస్ఫుర
త్పావకతాపితాఖిలవిపక్షులు నైన మహానుభావు లై
రావతకోటి ఘోరఫణిరాజులు మాకుఁ బ్రసన్ను లయ్యెడున్. 16

ప్రతిపదార్థం: దేవ, మనుష్య, లోకములన్= దేవతలయొక్కయు మనుష్యులయొక్కయు లోకాలందు; త్రిమ్మరుచున్= తిరుగుతూ; విపుల, ప్రతాప, సంభావిత, శక్తి, శౌర్యులున్= అధికమైన తేజస్సుచేత సన్మానింపబడిన (ఊహింపబడిన) సామర్థ్యాన్ని, పరాక్రమాన్ని కలవారున్నూ; అపార, విష+ఉత్కట, కోప, విస్ఫురత్, పావక, తాపిత+అఖిల, విపక్షులున్= అంతం లేని విషంచేత అధికమైన కోపంచేత ప్రకాశించే అగ్నిచేత తపింప చేయబడిన సర్వశత్రువులు కలవారున్నూ; ఐన; మహత్+అనుభావులు= గొప్ప ప్రభావం కలవారు; ఐరావత కోటి, ఘోర ఫణిరాజులు= ఐరావతులు (ఐరావత మనే పేరుగల గొప్ప నాగవంశం ఉన్నది. అందులో పలువురు నాగులు ఉంటారు) అనే కోటి సంఖ్యగల (అనేకులైన) భయంకరు లైన సర్పరాజులు; మాకున్= మాయెడ; ప్రసన్నులు= అనుగ్రహం కలవారు; అయ్యెడున్= అగు గాక!

తాత్పర్యం: దేవతల మనుష్యుల లోకాలలో తిరుగుతూ అధికమైన తేజస్సుచేత పూజింపబడిన సామర్థ్యం, పరాక్రమం కలవారున్నూ, అనంతవిషంచేత అధిక మైన కోపంతో ప్రకాశించే అగ్నిచేత తపింపజేయబడిన సర్వశత్రువులు కలవారున్నూ అయిన మహాత్ములు ఐరావత నాగవంశంలోని కోటిసంఖ్యాకు లైన భయంకర సర్పరాజులు మాపట్ల అనుగ్రహంకలవారు అగుదురుగాక!

విశేషం: కోపం వచ్చినప్పుడు పాములు విషం కక్కుతాయి. ఆ విషం నుండి అగ్ని ఉప్పతిల్లుతుంది. పాత్రస్వభావ వ్యంజకమైన అక్షరరమ్యత ఇందులో సముచితంగా సంతరించబడి ఉన్నది. ఘోరఫణిరాజులను వర్ణించే ఈపద్యంలో ఊష్మాక్షరాలతోపాటు, పరుషాక్షరాలను, స్థిరాక్షరాలనూ వాడటం విశేషం.

ఉ. గోత్రమహామహీధర నికుంజములన్ విపినంబులం గురు
క్షేత్రమునం బ్రకామగతి ఖేలన నొప్పి, సహాశ్వసేనుఁ డై
ధాత్రిఁ బరిభ్రమించు బలదర్ప పరాక్రమదక్షుఁ డీక్షణ
శ్రోత్రవిభుండు తక్షకుఁడు శూరుఁడు మాకుఁ బ్రసన్నుఁ డయ్యెడున్.17

ప్రతిపదార్థం: గోత్ర, మహత్, మహీ, ధర, నికుంజములన్= గొప్ప కులపర్వతాల యొక్క పొదరిండ్లలోనూ; విపినంబులన్= అడవులయందును; కురుక్షేత్రమునన్= కురుక్షేత్రంలోనూ; ప్రకామ, గతి, ఖేలనన్= ఇచ్చవచ్చినట్లుగా పోవటంలోని (సంచరించటంలోని) క్రీడతో; ఒప్పి= అలరి; సహ+అశ్వసేనుఁడు+ఐ= కుమారుడైన అశ్వసేనునితో కూడినవాడై; ధాత్రిన్= భూమియందు; పరిభ్రమించు= తిరుగాడు. బల, దర్ప, పరాక్రమ, దక్షుఁడు= బలంలోను, గర్వంలోను శౌర్యంలోను సమర్థుడు; శూరుఁడు= పరాక్రమవంతుడు; (ఐన) ఈక్షణశ్రోత్రవిభుండు= కన్నులే చెవులుగా గల పాములఱేడు; తక్షకుఁడు; మాకున్= మాయెడ; ప్రసన్నుఁడు= అనుగ్రహం కలవాడు; అయ్యెడున్= అగుగాక!

తాత్పర్యం: గొప్ప కులపర్వతాల పొదరిళ్ళలోను, అడవులలోను, కురుక్షేత్రంలోను ఇచ్చవచ్చినట్లు సంచరించే క్రీడతో అలరి, కుమారు డైన అశ్వసేనుడితో కూడి భూమిమీద తిరుగుతూ బలంలోనూ, గర్వంలోనూ, శౌర్యంలోనూ సమర్థుడైన పరాక్రమవంతుడూ పాములకురాజూ అయిన తక్షకుడు మాయెడ అనుగ్రహం కలవాడు అగుగాక!

విశేషం: ప్రశంసింపచేశాడో పరితకు అంతరార్థం ప్రసన్న మౌతుంది. ప్రసన్నకథాక (వి)లితార్థయుక్తి కిది చక్కని ఉదాహరణం. (సంపా.)

వ. అనియి ట్లురగపతుల నెల్ల స్తుతియించి 'యందు సితాసితతంతు సంతానపటంబు నునువయించుచున్నవారి నిద్దఱ స్త్రీలను, ద్వాదశార చక్రంబుం బరివర్తించుచున్న వారి నార్వురఁ గుమారుల, నతిప్రమాణ తురంగంబు నెక్కినవాని మహాతేజస్వి నొక్క దివ్యపురుషుం గని విపులార్థవంతంబు లైన మంత్రంబుల నతిభక్తియుక్తుం డై స్తుతియించినం బ్రసన్నుం డై యద్దివ్యపురుషుం డయ్యుదంకున కి ట్లనియె. 18

ప్రతిపదార్థం: అని= అని పలికి; ఇట్లు= ఈవిధంగా; ఉరగపతులన్+ఎల్లన్= నాగరాజుల నందరిని; స్తుతియించి= పొగడి; అందున్= నాగలోకంలో; సిత+అసిత, తంతు, సంతాన, పటంబున్= తెల్లని, నల్లని, దారాల సముదాయంతో కూడిన వస్త్రం; అనువయించుచున్+ఉన్నవారిన్= నేస్తున్న వారిని; ఇద్దఱ స్త్రీలను= ఇరువురు ఆడవారిని; ద్వాదశ+అర చక్రంబున్= పండ్రెండు (పన్నెండు) ఆకులు గల చక్రాన్ని; పరివర్తించుచు, ఉన్నవారిన్= త్రిప్పుతున్న వారిని; ఆర్వురన్, కుమారులన్= ఆరుగురు యువకులను; అతి, ప్రమాణ, తురంగంబున్= మిక్కిలి ఎత్తైన గుఱ్ఱాన్ని; ఎక్కిన వానిన్; మహత్, తేజస్విన్= గొప్ప తేజస్సు కలవాడిని; ఒక్క దివ్యపురుషున్= ఒక దేవతాపురుషుడిని; కని= చూచి; విపుల+ అర్థవంతంబులు+ ఐన= అధికమగు అర్థం కలవైన; మంత్రంబులన్= మంత్రాలతో; అతి, భక్తి, యుక్తుండు+ఐ= మిక్కిలి భక్తితో కూడినవాడై; స్తుతియించినన్= పొగడగా; ప్రసన్నుండు+ఐ= ప్రసాదం (అనుగ్రహం) కలవాడై; ఆ+దివ్యపురుషుండు= ఆ దేవతా పురుషుడు; ఆ+ఉదంకునకున్= ఆ ఉదంక మహామునితో; ఇట్లు= ఈవిధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అని ఈవిధంగా నాగరాజులందరిని పొగడి పాతాళలోకంలో తెల్లని నల్లని దారాల సముదాయంతో కూడిన వస్త్రాన్ని నేస్తున్న ఇద్దరు

స్త్రీలను, పండ్రెండు (పన్నెండు) ఆకులు గల చక్రాన్ని త్రిప్పుతున్నవారిని ఆరుగురు యువకులను, మిక్కిలి ఎత్తైన గుర్రాన్ని ఎక్కిన గొప్ప తేజస్సు కల ఒక దివ్యపురుషుడిని చూచి, అధికము లైన అర్థాలు గల మంత్రాలతో మిక్కిలిభక్తితో కూడినవాడై స్తుతించగా, ఆ దేవతాపురుషుడు అనుగ్రహం కలవా డై ఉదంకుడితో ఈ విధంగా పలికాడు.

విశేషం: నల్లని, తెల్లని దారాలతో కూడిన వస్త్రం విషయాన్నీ, ఇరువురు స్త్రీల విషయాన్నీ, ద్వాదశార చక్రాన్ని త్రిప్పుతున్న ఆరుగురు కుమారుల విషయాన్నీ, ఉత్తమ అశ్వాన్ని ఎక్కిన దివ్యపురుషుని విషయాన్నీ ముందు తెలియపరచటం అవుతుంది. (చూడు:1.118)

క. మితవచన! నీయథార్థ। ట
స్తుతుల కతిప్రీతమానసుఁడ నైతి ననిం
దిత చరిత! నీకు నభివాం।
ఛిత మెయ్యది దానిఁ జెపుమ చేయుదు నవినన్. 19

ప్రతిపదార్థం: మితవచన= పరిమిత మైన వాక్కులు కలవాడా!; అనిందిత, చరిత!= నిర్మల మైన వర్తనం కలవాడా! ఓ ఉదంకమహామునీ!; నీ= నీయొక్క, యథార్థ స్తుతు లకున్= సత్య మైన స్తోత్రాలకు; అతి, ప్రీత, మానసుఁడన్= మిక్కిలి ప్రీతి పొందిన మనస్సు కలవాడిని; ఐతిన్= అయినాను; నీకున్; అభివాంఛితము= కోరబడింది (కోరిక); ఏ+అది= ఏదో; దానిన్= ఆ కోరికను, చెపుము+అ= తెలుపుము; చేయుదున్= నెరవేరుస్తాను; అనినన్= అని ఆ దివ్యపురుషుడు పలుకగా.

తాత్పర్యం:పరిమితమైన వాక్కులు, నిర్మల మైనవర్తనం కలిగినట్టి ఓ ఉదంక మహామునీ! సత్యాలైన నీస్తోత్రాలచేత మిక్కిలి ప్రీతి పొందిన మనస్సు కలవాడ నైనాను. నీకు ఏ కోరిక కలదో దానిని చెప్పుము; నేను నెరవేరుస్తాను - అని దివ్య పురుషుడు పలుకగా

వ. ఉదంకుండు గరంబు సంతసిల్లి 'యిన్నాగకులం బెల్ల నాకు వశం బగునట్టులుగ ననుగ్రహింపు' మనిన నప్పురుషుం 'డట్లేని నీయశ్వకర్ణ రంధ్రాధ్మానంబు సేయు' మనిన వల్లె యని తద్వచనాను రూపంబు సేయుడుఁ దత్‌క్షణంబ. 20

ప్రతిపదార్థం: ఉదంకుడు; కరంబు= మిక్కిలి; సంతసిల్లి= సంతోషించి; ఈ+ నాగకులంబు+ఎల్లన్= ఈ పాముల సముదాయం అంతయున్నూ; నాకున్, వశంబు, అగు, అట్టులుగన్= అధీన మయ్యేటట్లుగా (వశపడేటట్లుగా); అనుగ్రహింపుము= దయచూపుము; అనినన్= అని ఉదంకుడు పలుకగా; ఆ+పురుషుండు= ఆ దివ్య పురుషుడు; అట్లు+ఏనిన్= నీ కటువంటి కోరిక ఉన్నట్లయితే; ఈ, అశ్వ, కర్ణ, రంధ్ర+ ఆధ్మానంబు= నే నెక్కిన ఈ గుర్రం యొక్క చెవియందు ఊదుట; చేయుము+ అనినన్= చేయు మని ఆ దివ్యపురుషుడు పలుకగా; వల్లె= అట్లే; అని; తద్, వచన+ అనురూపంబు= ఆ దివ్యపురుషుడి వాక్కునకు తగింది; చేయుడున్= చేసిన అనంతరం; తద్+క్షణంబు+అ= ఆ క్షణంలోనే, వెంటనే.

తాత్పర్యం: ఉదంకుడు మిక్కిలి సంతోషించి 'ఈ పాముల వంశమంతా నా కధీన మయ్యేటట్లు కరుణించు' మని పలుకగా ఆ దివ్యపురుషుడు 'అట్లైతే ఈ గుర్రంయొక్క చెవికన్నంలో ఊదు' మని అన్నాడు. ఉదంకుడు అట్లే అని అంగీకారం సూచించి, ఆ దివ్యపురుషుడు పలికిన వాక్కులకు తగినట్లు చేయగా వెంటనే.

విశేషం: మూలంలో ఇచ్చట గుర్రంయొక్క అపానంలో ఊదు మని దివ్యపురుషుడు చెప్పినట్లు ఉన్నది. ఋషి అట్లా చేయటం ఉచితంగా ఉండ దని నన్నయ అపానాన్ని తొలగించి దానికి బదులు కర్ణరంధ్ర మని వ్రాశాడు.

శా. పాతాళైకనికేతనాంతరమునం బర్వెం దదశ్వాఖిల
స్రోతోమార్గ వినిర్గతోగ్ర దహనార్చుల్, పన్నగవ్రాతముల్

భీతిల్లెన్, భుజగాధినాథు మనమున్ భేదిల్లెఁ గల్పాంత సం
జాతప్రోద్ధత బాడబానల శిఖాశంకాధికాతంక మై. 21

ప్రతిపదార్థం: తద్+అశ్వ+అఖిల, స్రోతస్+మార్గ, వినిర్గత+ఉగ్ర, దహన+ అర్చుల్= ఆ గుఱ్ఱముయొక్క సర్వఇంద్రియాలమార్గాల నుండి బయల్వెడలిన భయంకరమైన అగ్నియొక్క జ్వాలలు; పాతాళ+ఏక, నికేతన+అంతరమునన్= నాగలోక మనే ముఖ్యమైన(సాటిలేని) భువనం యొక్క మధ్య భాగంలో; పర్వెన్= వ్యాపించినవి; పన్నగవ్రాతముల్= పాముల సముదాయాలు; భీతిల్లెన్= భయపడినవి; కల్ప+అంత, సంజాత, ప్రోద్ధత, బాడబ+అనల, శిఖా, శంకా, అధిక+ఆతంకము+ఐ= ప్రళయకాలంలో పుట్టి విజృంభించిన బడబాగ్ని యొక్క జ్వాలలనే సందేహంవలన అధికమైన భయం కలదై; భుజగ+ అదినాథు= సర్పరాజు యొక్క మనమున్= మనస్సుకూడ; భేదిల్లెన్= బ్రద్ధలైనది.

తాత్పర్యం: పాతాళ మనే ముఖ్యమయిన భువనమధ్యంలో ఆ గుఱ్ఱముయొక్క సర్వేంద్రియ ద్వారాలనుండి బయల్వెడలిన భయంకరమైన అగ్నిజ్వాలలు వ్యాపించినవి. పాముల సముదాయాలు భయపడినవి; ప్రళయకాలంలో పుట్టి పైకెగసిన బడబాగ్నిజ్వాల లనే సందేహంవలన కలిగిన అధిక మైన భయం కలదై పాములరాజుయొక్క హృదయం కూడ బ్రద్దలయింది.

విశేషం: అలం: నన్నయ రచనలోని అక్షరరమ్యత కీపద్యం ఉదాహరణం. ఇందులో భయానకరసం స్ఫురిస్తుంది. దానిని పోషించేటట్లు - మార్గ, వినిర్గత, అర్చివంటి ద్విత్వాక్షరాలనూ, భ, ధ, భ, వంటి మహాప్రాణాలనూ వాడుతూ సమాసభూయిష్ఠమైన రచనతో ఓజోగుణాన్ని పోషించి బడబానలజ్వాలలవంటి అగ్నిజ్వాలల భయంకరరూపాన్ని అక్షరరమ్యంగా నన్నయ ఆవిష్కరించాడు.

తక్షకుండు కుండలంబులం దెచ్చి యుదంకున కిచ్చుట (సం.1-3-158)

క. శంకరనిభుఁ డగు విప్రుభ।
యంకరకోపాగ్ని యొక్కొ! యనుచును జాతా

తంకుఁ డయి కుండలంబు లు ।
దంకునకును దెచ్చి యిచ్చెఁ దక్షకుఁ డంతన్. 22

ప్రతిపదార్థం: అంతన్= అప్పుడు; తక్షకుడు; శంకరనిభుఁడు+అగు= శివునితో సమాను డైన; విప్రు= బ్రాహ్మణుడియొక్క; భయంకర, కోప+అగ్ని, ఒక్కొ= భయం కలిగించే కోపమనే అగ్నియేమో; అనుచును= అని భావిస్తూ; జాత+ఆతంకుఁడు+అయి= పుట్టిన భయం కలవాడై; ఉదంకునకును= ఉదంక మహామునికి; కుండలంబులు= కర్ణా భరణాలు; తెచ్చి; ఇచ్చెన్= తెచ్చి ఇచ్చాడు.

తాత్పర్యం: అంత తక్షకుడు శివుడితో సమాను డైన బ్రాహ్మణుడి భయంకర మైన కోప మనే అగ్నియేమో! అని తలుస్తూ భయంతో కూడినవాడై కుండలాలను ఉదంకమహామునికి తెచ్చి ఇచ్చాడు.

విశేషం: అలం: రూపకం; ఉత్ప్రేక్ష.

వ. ఇట్లు నాగలోకంబున కెల్ల మహాక్షోభంబు గావించి తక్షకుచేతఁ గుండలంబులు గొని యుదంకుఁ డాత్మగతంబున. 23

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; నాగలోకంబునకున్+ఎల్లన్= పాతాళలోకాని కంతటికి; మహాక్షోభంబు= గొప్ప కలత; కావించి= చేసి,కలిగించి; తక్షకుచేతన్= తక్షకుడి నుండి (వలన); కుండలంబులు= కర్ణాభరణాలు; కొని= గ్రహించి; ఉదంకుఁడు; ఆత్మగతంబునన్= తనలో.

తాత్పర్యం: ఈ విధంగా సర్పలోకాని కంతటికి గొప్పకలత కలిగేటట్లు చేసి తక్షకుడి (వలన) నుండి కుండలాలు గ్రహించి ఉదంకుడు తనలో.

విశేషం: ఆత్మగత మనేమాట నాటకంలో స్వగత మనే అర్థంలో రంగస్థలసూచనగా వాడుతుంటారు. పైకి వినబడని భాషణం ఆత్మగత మని సాహిత్యదర్పణం.

సీ. 'కుండలమ్ములు వేగ కొనిరమ్ము నాలవ ।
నాఁటికి నని పూని నన్నుఁ బనిచె

గురుపత్ని; నేఁడ యక్కుండలంబులు దొడ్గు ।
దివస; మీ దివస మతిక్రమింప
కుండంగఁబోక యె ట్లొడఁగూడు? ని న్నాగ ।
భవన మెప్పాట వెల్వడఁగఁ బోలు?
నేఁడు పోవనినాఁడు నిష్ఫలం బిమ్మహా ।
యత్నమంతయు' నని యధికచింతఁ

ఆ. దవిలియున్న నయ్యుదంకు నభిప్రాయ ।
మెఱిఁగి దివ్యపురుషుఁ డిట్టు లనియె:
'నీహయంబు నెక్కి యేఁగుము; యిది వడి ।
గలదు మనముకంటె గాడ్పుకంటె'. 24

ప్రతిపదార్థం: గురుపత్ని= గురువుగారి భార్య; నాలవ నాఁటికిన్= నేటికి నాల్గవరోజుకు; కుండలంబులు= చెవికమ్మలు; వేగ= వేగంగా; కొనిరమ్ము= తీసికొనిరమ్ము; అని; పూని= పట్టుదలతో, కడగి; నన్ను; పనిచెన్= పంపింది; నేడు+అ= నేడే; ఆ కుండలంబులు= ఆ కర్ణాభరణాలు; తొడ్గ= ధరించే; దివసము= రోజు; ఈ దివసము= ఈ రోజు; అతిక్రమింపక, ఉండంగన్= దాటిపోకుండ; పోక= పోవటం; ఎట్లు= ఏవిధంగా; ఒడన్, కూడున్= సమకూరుతుంది?; ఈ నాగభవనము= ఈ సర్పలోకం; (నుండి) ఏ+పాటన్= ఏవిధంగా; వెల్వడఁగన్, పోలున్= బయటకు పోవటానికి వీలౌతుంది?; నేఁడు= ఈరోజు; పోవనినాఁడు= వెళ్ళకపోతే; ఈ+మహత్ యత్నము+ అంతయున్= నేను చేసిన ఈగొప్పయత్నమంతా; నిష్ఫలంబు= ఫలం లేనిది (నిష్ప్రయోజనం) అని; అధికచింతన్= పెనుదిగులునందు; తవిలి ఉన్నన్= చిక్కి ఉండగా; ఆ+ఉదంకు+అభిప్రాయము= ఆ ఉదంకునియొక్కభావం; ఎఱిఁగి= తెలిసికొని; దివ్యపురుషుఁడు= (గుర్రాన్ని ఎక్కి ఉన్న) దేవతా పురుషుడు; ఇట్టులు= ఈవిధంగా; అనియెన్= అన్నాడు; ఈ హయంబున్= ఈ గుర్రాన్ని; ఎక్కి; ఏఁగుము+ఆ= వెళ్ళుము; ఇది= ఈ గుర్రం;

మనముకంటెన్= మనస్సుకంటె; గాడ్పుకంటెన్= గాలికంటె; వడి, కలదు= వేగం కలిగి ఉన్నది.

తాత్పర్యం: 'నేటికి నాల్గవరోజున కుండలాలను వేగంగా తీసికొని రమ్మని గురువుగారిభార్య పట్టుదలతో నన్ను పంపింది. ఆ కుండలాలు ధరించే దినం ఈనాడే. ఈరోజు దాటకుండ నేను అక్కడికి పోవటం ఏవిధంగా సమకూరుతుంది? ఈ నాగలోకంనుండి ఎట్లా బయటికి వెళ్ళవచ్చును? నేను వెళ్ళకపోతే నేను చేసిన ఈ మహాప్రయత్నమంతా నిష్ప్రయోజన మౌతుంది' - అని మిక్కిలి విచారంతో కలతనొంది యున్న ఆ ఉదంకుడి భావం తెలిసికొని తురగారూఢు డైన దివ్యపురుషుడు ఇట్లా పలికాడు: 'నీవీ గుర్రం ఎక్కి వెళ్ళుము. ఇది మనస్సుకంటె గాలికంటె వేగం కలిగినది'.

విశేషం: మనస్సు, గాలీ వేగం కలవాటిలో ప్రసిద్ధా లైనవి. కథాకథనానికి ఉపయోగపడే ఇటువంటి సీసాలను కొందరు 'గునుగు' సీసాలంటారు.

వ. అనవుడు నద్దివ్యపురుషువచనంబున నత్తురంగంబు నెక్కితత్క్షణంబ యయ్యుదంకుండు గురుగృహంబునకు వచ్చె; నిట గురుపత్నియు శుచిస్నాత యై నూతనపరిధానశోభిత యై యక్కుండలంబులు దొడువ నవసరం బైనఁ దదాగ మనంబు గోరుచున్నయది యప్ప డయ్యుదంకుం గని తద్దయు సంతసిల్లి, తదానీతరత్నకుండల భూషిత యై, బ్రాహ్మణులం బూజించి నిజసంకల్పిత మహోత్సవం బొనరించె; నట్లు గురుకార్యంబు నిర్వర్తించి యున్న యుదంకుం జూచి గురుం డి ట్లనియె. 25

ప్రతిపదార్థం: అనవుడున్= అనిన తరువాత; ఆ+దివ్య, పురుషు= ఆ దేవతాపురుషుడి యొక్క; వచనంబునన్= మాటచే (మాటప్రకారం); ఆ+తురంగంబున్= ఆ గుర్రాన్ని; ఎక్కి; తద్+క్షణంబు+అ= ఆ క్షణమే, వెంటనే; ఆ+ఉదంకుండు; గురు, గృహంబు నకున్= గురువుగారి ఇంటికి; వచ్చెన్; ఇట= ఇక్కడ గురుగృహంలో; గురుపత్నియున్= గురువుగారి భార్యయున్నూ; శుచి, స్నాతయున్= పవిత్రతకొరకు స్నానంచేసినది; ఐ= అయి;. నూతన, పరిధాన శోభిత+ఐ= క్రొత్తవస్త్రాలతో ప్రకాశించినదయి; ఆ+ కుండలంబులు= ఆ కర్ణాభరణాలు; ధరింపన్= ధరించటానికి; అవసరంబు= సమయం; ఐనన్= కాగా; తద్+ఆగమనంబు= ఉదంకునిరాక; కోరుచున్న+అది= కోరుతున్నది; అప్పుడు; ఆ+ఉదంకున్= ఆ ఉదంకుని; కని= చూచి; తద్దయున్= మిక్కిలి; సంతసిల్లి= సంతోషించి; తద్, ఆనీత, రత్న, కుండల, భూషిత, ఐ= అతనిచేత తేబడిన మణిమయ కర్ణాభరణాలచేత అలంకరింపబడిన దై; బ్రాహ్మణులన్; పూజించి= పూజ చేసి; నిజ, సంకల్పిత, మహత్, ఉత్సవంబు= తనచేత సంకల్పింపబడిన గొప్పదైన వేడుక; ఒనరించెన్= చేసెను; అట్లు= ఆవిధంగా; గురుకార్యంబు= గురువుగారి పని (గురుపత్ని కార్య మైనా గురుకార్యమే); నిర్వర్తించి= చేసి; ఉన్న=ఉండిన; ఉదంకున్; చూచి; గురుండు= గురు వైన పైలుడు; ఇట్లు= ఈవిధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: దివ్యపురుషుడు ఆ విధంగా పల్కిన తరువాత ఆతనిమాట ప్రకారం ఆ గుర్రాన్ని ఎక్కి ఉదంకుడు వెంటనే గురువుగారింటికి వచ్చాడు. గురుగృహంలో గురువుగారిభార్య పవిత్రస్నానం చేసి క్రొత్తబట్టలు కట్టుకొని వెలుగొందుతూ కర్ణాభరణాలు ధరించే సమయం ఆసన్నంకాగా, శిష్యుడైన ఉదంకుడి రాకకొరకు ఎదురుచూస్తున్నప్పుడు ఆ ఉదంకుడు రాగా చూచి, మిక్కిలి సంతోషించి, అతడు తెచ్చిన మణిమయకుండలాలను ధరించి, విప్రులను పూజించి, తాను సంకల్పించిన మహోత్సవాన్ని జరుపుకొన్నది. ఆ విధంగా గురువుగారిపని చేసి ఉన్న ఉదంకుడిని చూచి గురు వైన పైలుడు ఈవిధంగా పలికాడు.

క. ఈయున్న పౌష్యుపాలికిఁ ।
బోయి కడుంబెద్దదవ్వు పోయిన య ట్ల
త్యాయత విమల తపోమహి ।
మా! యిన్ని దినంబు లేల మసలితి చెపుమా! 26

ప్రతిపదార్థం: ఈ, ఉన్న= ఇచ్చటనే ఉన్న 'ఈ' సామీప్యాన్ని సూచిస్తుంది). పౌష్య, పాలికిన్= పౌష్యమహారాజు చెంతకు; పోయి= వెళ్ళి; కడున్= మిక్కిలి; పెద్ద= అధికమైన; దవ్వు= దూరం; పోయిన, అట్లు= పోయినవిధంగా; అతి+ఆయత, విమల, తపః, మహిమా= మిక్కిలి అధికమైన నిర్మలమైన తపస్సుయొక్క మహత్త్వం కలవాడా!; ఇన్ని, దినంబులు= ఇన్ని (నాలుగు) రోజులు; ఏల= ఏకారణంచేత; మసలితి(వి)= ఆలస్యం చేసినావు?; చెపుమా= తెలుపుము.

తాత్పర్యం: మిక్కిలి అధికమైన నిర్మలమైనతపస్సుయొక్కమహిమ కలవాడా! ఇక్కడికి అతిసమీపంలో ఉన్న పౌష్యమహారాజుచెంతకు పోయి, చాలాదూరం పోయినవిధంగా ఏకారణంచేత ఇంతఆలస్యం చేశావో తెలియజెప్పుము.

విశేషం: పౌష్యనిపురం దగ్గరగానే ఉన్నది. నీవు గొప్ప తపస్సంపన్నుడవు. నీవు అచ్చటికి పోయి రావటానికి నాల్గురోజులు పట్టింది. ఇంత ఆలస్యం కావటానికి కారణ మేమి టని గురువు అడిగాడు. 'అత్యాయత విమల తపోమహిమా!' అనే సంబోధనం సాభిప్రాయం. తపోమహిమతో ఎటువంటి కార్యమైననూ సులభంగా చేయవచ్చును. 'ఈయున్న' అనే ఎత్తుగడ సంభాషణ సహజత్వం ఉట్టిపడేటట్లు నుడికారపు సొంపును ప్రదర్శిస్తున్నది.

వ. అనిన నుదంకుం డి ట్లనియెః 'నయ్యా! మీ యానతిచ్చినట్ల మసల వలవదు; తక్షకుం డను దుష్టోరగంబు సేసిన విఘ్నంబున నింత మసలవలసె; వినుఁడు: మిమ్ము వీడ్కొని చనువాఁడ నెదుర నొక్క మహోక్షంబు నెక్కి చనుదెంచువాని నొక్కదివ్యపురుషుం గని, వాని పన్నిన వృషభగోమయ భక్షణంబు సేసి చని పౌష్యమహాదేవి కుండలంబులు ప్రతిగ్రహించి వచ్చుచోఁ దక్షకుచేత నపహృతకుండలుండ నై వాని పిఱుందన పాతాళలోకంబునకుం బోయి నాగపతుల నెల్ల స్తుతియించి, యందు

సితాసితతంతు సంతానపటంబు ననువయించుచున్నవారి నిద్దఱ స్త్రీలను, ద్వాదశార చక్రంబుఁ బరివర్తించుచున్నవారి నార్వురఁ గుమారుల, నతిప్రమాణ తురగారూఢుండైన యొక్క దివ్యపురుషుం గని, తత్ప్రసాదంబునఁ గుండలంబులు వడసి, తదాదేశంబున నత్తురంగంబు నెక్కివచ్చితి; నిది యంతయు నేమి? నా కెఱింగింపుఁ' డనిన గురుం డిట్లనియె. 27

ప్రతిపదార్థం: అనినన్= గురువు అట్లనగా; ఉదంకుండు; ఇట్లు= ఈవిధంగా; అనియెన్= పల్కెను; అయ్యా= ఆర్యా!; మీ, ఆనతి, ఇచ్చిన, అట్లు+అ= మీరు సెలవిచ్చిన విధంగా (కర్తృపద ప్రథమకు షష్ఠి); మసల, వలవదు= ఆలస్యం చేయ నవసరం లేదు; తక్షకుండు+అను; దుష్ట+ఉరగంబు= చెడ్డపాము; చేసిన; విఘ్నంబునన్= ఆటంకంచేత; ఇంత= ఇంతకాలం; మసల, వలసెన్= ఆలస్యం చేయవలసి వచ్చింది; వినుఁడు; మిమ్మున్= (గురువుగారిని); వీడ్కొని= విడిచి (మీదగ్గర సెలవు తీసికొని); చను, వాఁడన్= వెళ్ళువాడను; ఎదురన్= నా ఎదుట; ఒక్క, మహత్, ఉక్షంబున్= గొప్ప (ఉన్నతమైన) ఎద్దును; ఎక్కి; చనుదెంచు, వానిన్= వచ్చువాడిని; ఒక్క, దివ్య, పురుషున్= ఒక దేవతాపురుషుడిని; కని= చూచి; వాని, పన్నిన= (కర్తృపద ప్రథమకుషష్ఠి) అతడు ఏర్పరచిన; వృషభ, గోమయ, భక్షణంబు= ఎద్దుపేడ తినటం; చేసి; చని= వెళ్ళి; పౌష్య, మహా, దేవి= పౌష్యుడి దేవేరియొక్క; కుండలంబులు; ప్రతిగ్రహించి= దానంగా తీసికొని; వచ్చుచోన్= వచ్చేటప్పుడు; తక్షకుచేతన్= తక్షకు డనే సర్పరాజుచేత; అపహృత, కుండలుండను+ఐ= దొంగిలించబడిన కుండలాలు కలవాడ నై; వాని, పిఱుందన్+అ= అ తక్షకుడి వెనుకనే; పాతాళ లోకంబునకున్= నాగలోకానికి; పోయి= వెళ్ళి; నాగ, పతులన్, ఎల్లన్= సర్పరాజుల నందరిని; స్తుతియించి= పొగడి; అందున్= ఆ పాతాళంలో, సిత+అసిత, తంతు, సంతాన, పటంబున్= తెల్లని నల్లని దారాల సముదాయంతో కూడిన వస్త్రాన్ని;

అనువయించుచున్+ఉన్నవారిన్= నేస్తూ ఉన్నవారిని; ఇద్దఱ, స్త్రీలను= ఇరువురు ఆడువారిని; ద్వాదశ+అర, చక్రంబున్= పండెండ్రు (12) ఆకులు కల చక్రాన్ని; పరివర్తించుచున్+ఉన్న, వారిన్= త్రిప్పుచున్న వారిని; ఆర్వురన్, కుమారులన్= ఆర్గురు బాలకులను; అతి, ప్రమాణ, తురగ+ఆరూఢుండు+ ఐన= మిక్కిలి ఎత్తైన గుర్రాన్ని ఎక్కినవాడిని; ఒక్క, దివ్యపురుషున్= ఒక దేవతా పురుషుడిని; కని= చూచి; తద్, ప్రసాదంబునన్= ఆ దివ్యపురుషుడి అనుగ్రహంచేత; కుండలంబులు; పడసి= పొంది; తద్+ఆదేశంబునన్= ఆ పురుషుడి ఆజ్ఞచేత; ఆ+తురంగంబున్= ఆ గుర్రాన్ని, ఎక్కి; వచ్చితిన్; ఇది, అంతయున్= పైన పేర్కొనబడిన దంతయున్నూ; ఏమి= ఏమిటి?; నాకున్; ఎఱింగింపుఁడు= అంతరార్థం తెల్పండి; అనినన్= అని ఉదంకుడు అడుగగా; గురుండు= పైలుడు; ఇట్లు= ఈవిధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అని గురువుగారు అడుగగా ఉదంకుడు ఈవిధంగా చెప్పాడు: 'ఆర్యా! మీరు సెలవిచ్చినట్లు ఆలస్యం చేయవలసిన అవసరం లేదు. కాని, తక్షకుడు అనే పేరు గల దుష్టు డైన నాగరాజు చేసిన ఆటంకంచేత ఇన్ని రోజులు ఆలస్యం చేయవలసి వచ్చింది. నేను మిమ్ము వీడి వెళ్ళుతూ ఎదుట ఒక పెద్దఎద్దు నెక్కి వచ్చేవాడిని ఒక దేవతాపురుషుడిని చూచి అత డేర్పరచిన ఎద్దుపేడ తిని వెళ్ళి, పౌష్యమహారాజుదేవేరికర్ణాభరణాలు పుచ్చుకొని వస్తూ ఉన్నాను. వస్తూ ఉండగా తక్షకుడిచేత కుండలాలు అపహరింపబడ్డవి. నేను ఆ తక్షకుడి వెనుకనే నాగలోకానికి పోయి సర్పరాజులనందరిని పొగడి, ఆపాతాళలోకంలో తెల్లని నల్లని దారాలతో కూడిన వస్త్రం నేస్తున్న ఇద్దరు స్త్రీలను, పండ్రెండాకులు కల చక్రాన్ని త్రిప్పుతున్న ఆరుగురు బాలురను (యువకులను); మిక్కిలి ఎత్తైన గుర్రాన్ని ఎక్కిన ఒక దివ్యపురుషుడిని చూచి, అతని అనుగ్రహంచేత కర్ణాభరణాలు పొంది, అత డాజ్ఞాపించిన విధంగా ఆ గుర్రం ఎక్కి వచ్చాను. ఇదంతయు ఏమిటి? దీని అంతరార్థం నాకు తెలపండి' అని అడుగగా గురువైన పైలుడు ఈవిధంగా పలికాడు.

సీ. అప్పురుషుం డింద్రుఁ, డయ్యుక్ష మైరావ ।
తంబు, గోమయ మమృతంబు, నాగ
భువనంబులోఁ గన్న పొలఁతు లిద్దఱు ధాత ।
యును విధాతయు, వారి యనువయించు
సితకృష్ణతంతురాజిత తంత్ర మది యహో ।
రాత్రంబు, ద్వాదశారములు గలుగు
చక్రంబు మాసాత్మ సంవత్సరంబు, కు ।
మారు లయ్యార్వురు మహితఋతువు,

ఆ. లత్తురంగ మగ్ని, యప్పురుషుండు ప ।
ర్జన్యుఁ డింద్రసఖుఁడు సన్మునీంద్ర ।
యాది నింద్రుఁ గాంచి యమృతాశి వగుట నీ ।
కభిమతార్థ సిద్ధి యయ్యెనయ్య! 28

ప్రతిపదార్థం: సత్+ముని+ఇంద్ర= మంచి మునిశ్రేష్ఠుడా! ఉదంకా!; ఆ+పురుషుఁడు= ఎద్దు ఎక్కివచ్చిన పురుషుడు; ఇంద్రుఁడు; ఆ+ఉక్షము= ఆ ఎద్దు; ఐరావతంబు= దేవేంద్రుని వాహన మైన ఏనుగు; గోమయము= పేడ; అమృతంబు; నాగ, భువనంబు లోన్= నాగలోకంలో; కన్న= నీవు చూచిన; పొలఁతులు, ఇద్దఱు= స్త్రీలు ఇరువురు; ధాతయును; విధాతయు; వారి, అనువయించు= వారు నేసెడి; సిత, కృష్ణ, రాజిత, తంత్రము+అది= తెల్లని నల్లని దారాలతో ప్రకాశించే ఆ మగ్గం; అహః, రాత్రము= పగలు, రాత్రి; ద్వాదశ+అరములు= పండ్రెండు (12) ఆకులు; కలుగు; చక్రంబు= చక్రం; మాస+ఆత్మ, సంవత్సరంబు= నెలల రూపమైన సంవత్సరం; కుమారులు, ఆ+ఆర్వురు= చక్రాన్ని త్రిప్పుతున్న ఆ ఆర్గురు బాలురు; మహిత, ఋతువులు= గొప్ప వసంతాదు లైన ఋతువులు; ఆ+తురంగము= ఆ గుర్రం; అగ్ని; ఆ+ పురుషుండు= ఎత్తైన గుర్రాన్ని ఎక్కి కనబడిన ఆ

పురుషుడు; ఇంద్ర, సఖుఁడు= ఇంద్రుడి మిత్రు డైన; పర్జన్యుఁడు= వర్షాధిదేవత; ఆదిన్= మొదట; ఇంద్రున్= ఇంద్రుడిని; కాంచి= చూచి; అమృత+ఆశివి+ అగుటన్= అమృతాన్ని తిన్నవాడవగుటచేత; నీకున్; అభిమత+అర్థ, సిద్ధి= కోరబడిన ప్రయోజనం యొక్క ఫలం (నెరవేరటం); అయ్యెన్+అయ్యు= కలిగినదయ్యా!

తాత్పర్యం: ఓ మంచిముని శ్రేష్ఠుడా! ఉదంకా! ఎద్దు నెక్కివచ్చిన ఆ పురుషుడు ఇంద్రుడు. అత డెక్కిన ఎద్దు దేవతల ఏను గైన ఐరావతం. పేడ అమృతం. పాములలోకంలో ఉన్న ఇద్దరు స్త్రీలు ధాత, విధాత అనేవారు. వారు నేసే తెల్లని నల్లని దారాల మగ్గం దినరాత్రి రూపం. పండ్రెండాకులు గల చక్రం నెలలరూప మైన సంవత్సరం. దానిని త్రిప్పే ఆర్గురు యువకులు గొప్పఋతువులు (వసంతం, గ్రీష్మం, వర్షం, శరత్తు, హేమంతం, శిశిరం). ఆ గుర్రం అగ్ని. దాని నెక్కిన దివ్యపురుషుడు ఇంద్రుడి మిత్రు డైన పర్జన్యుడు. మొదట ఇంద్రుడిని చూచి అమృతం తిన్నవాడ వగుటచేత నీకు వాంఛితార్థసిద్ధి కలిగింది. నీవు కోరినపని నెరవేరింది. కుండలాలు లభించాయి.

విశేషం: పర్జన్యుడు వర్షాధిదేవత. ఇంద్రుడినే పర్జన్యు డని అంటారు. ఇక్కడ అతడు ఇంద్రమిత్రుడిగా చెప్పబడినాడు. పర్జన్యుడంటే విష్ణువు అనే అర్థం కూడ ఉన్నది. పర్జన్యము= గర్జించే మేఘం, మేఘు డని కూడ చెప్పవచ్చు.

క. **కర మిష్టము సేసితి మా ।**
కరిసూదన! దీన నీకు నగు సత్ఫలముల్;
గురుకార్యనిరతు లగు స ।
త్పురుషుల కగు టరుదె? యధికపుణ్యఫలంబుల్. **29**

ప్రతిపదార్థం: అరి, సూదన= శత్రువులను సంహరించేవాడా! ఉదంకా! మాకున్= నాకు, నా భార్యకున్నూ; కరము= మిక్కిలి; ఇష్టము= ప్రియం (కోరబడింది); చేసితి(వి); దీనన్= ఇట్లు చేయటం చేత; నీకున్; సత్+

ఫలముల్= మంచిఫలాలు, అగున్= కలుగుతాయి; గురు, కార్య, నిరతులు= గురువుగారి పనియందు ఆసక్తికలవారు; అగు; సత్,పురుషులకున్ యోగ్యు లైన జనులకు; అధిక, పుణ్య, ఫలంబుల్= గొప్ప పుణ్యాల ఫలితాలు; అగుట= కలగటం; అరుదు+ఎ= అపూర్వమా? ఏమీ కాదు.

తాత్పర్యం: శత్రువులను సంహరించువాడా! మాకు మిక్కిలి ప్రియాన్ని (కుండలాలను తెచ్చి ఇవ్వటం) కలిగించావు. ఈవిధంగా చేయటంవలన నీకు మంచిఫలితాలు కలుగుతాయి. గురువుల పనులందు ఆసక్తులయ్యే సజ్జనులకు గొప్పపుణ్యాలు చేసిన ఫలాలు కలగటంలో వింత లేదు.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. నన్నయ నానారుచిరార్థ సూక్తినిధి, అతడి సూక్తులలో ఇది ఒకటి. గురుసేవ చేసి, వారిని సంతోషపెట్టటంవలన దేవతలు ప్రసన్నులౌతారని- ఆర్యోక్తి. "అథసేవామనిచ్ఛంతం గురు మర్థేన తోషయేత్! గుర్వర్థే యతమానం తం అనుగృహ్ణంతి దేవతాః'' (సేవకు అంగీకరించని గురువును ధనంతో సంతోషపెట్టాలి. గురుదక్షిణకోసం పాటుపడే శిష్యుడిని దేవతలు అనుగ్రహిస్తారు) అనే తాత్పర్యాన్ని ఉదంకోపాఖ్యానం బోధిస్తుంది.

* * *